# అగ్నిధార

http://www.agnidharanews.com

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

ఆదివారం 6 జూలై 2025

పేజీలు : 5 వెల : 5/-


Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad


## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## చెక్కతో చేసిన సాధారణ కుర్చీలా చూడొద్దు

- మోదీ ఎమోషనల్ స్పీచ్.. ఈ కుర్చీ ప్రత్యేకత ఇదే!
- ఇది భారత్-ట్రినిడాడ్ అండ్ టొబాగో మధ్య ఉన్న స్నేహం, నమ్మకం, దృఢమైన ప్రజాస్వామ్య బంధానికి నిదర్శనం
- ఏళ్ల పాటు బ్రిటీష్ పాలనలో ఉన్న ట్రినిడాడ్ అండ్ టొబాగోకు 1962లో విముక్తి
- దీంతో ఈ దేశానికి 1968లో ఓ ప్రత్యేక బహుమతిని పంపించింది భారత ప్రభుత్వం.

# రండి.. కలిసికట్టుగా ముందుకు సాగుదాం



- పిల్లలు, మహిళల రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది
- బాలికల సంరక్షణ కోసం తెలంగాణ 'భరోసా' ప్రాజెక్టును తీసుకొచ్చింది
- అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి
- ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయపరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి
- ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బాలల లైంగిక వేధింపులు, రక్షణ అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో సీఎం

హైదరాబాద్

వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్ అనే థీమ్‌తో తమ బాధను చెప్పుకోలేని వారికి రక్షణ కల్పించేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం చాలా అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బాలల లైంగిక వేధింపులు, రక్షణ అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో సీఎం పాల్గొని ప్రసంగించారు. ఎంతో కీలకమైన అంశంపై సదస్సు నిర్వహిస్తున్న తెలంగాణ పోలీస్, ఇతర నిర్వాహకులను సీఎం అభినందించారు. ఇలాంటి నేరాలను నియంత్రించడమే కాకుండా బాల బాధితులకు చట్టపరమైన అన్ని రకాల రక్షణ కల్పించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. లైంగిక వేధింపుల నుంచి అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. పిల్లలు, మహిళల రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. బాలికల సంరక్షణ కోసం తెలంగాణ 'భరోసా' ప్రాజెక్టును తీసుకొచ్చిందని.. అనుసంధానంగా 29 కేంద్రాలు పనిచేస్తున్నాయని వెల్లడించారు. ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయపరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడమే ఈ కేంద్రాల లక్ష్యమని - మిగతా3లో



## 20ఏళ్ల తర్వాత.. ఒకే వేదికపై ఠాక్రే సోదరులు

- 2005లో విడిపోయిన వీరు దాదాపు 20 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకోవడం మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం
- ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం ద్వారా మన పిల్లలు సరైన విషయాలు నేర్చుకొనే అవకాశం లేకుండా పోతోంది
- ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్నప్పటికీ తమ మాతృభాషలైన తెలుగు, తమిళం వంటి భాషల విషయంలో ఎంతో గర్వంగా ఉంటారు.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం



- గత ప్రభుత్వం మహిళా సమాఖ్యలను పట్టించుకోలేదు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది
- ఇప్పటికే మహిళల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేస్తున్నాం
- కోటి మంది మహిళలను కోటీశ్వరీమణులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది
- మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను గ్రౌండ్ లెవెల్లో తెలిసేలా కార్యక్రమాలు చేస్తున్నాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్

ఆర్టీసీలో 151 మండల మహిళా సంఘాల గ్రూప్‌లకు (అద్దె బస్సుల యజమానులకు) రూ.1.05 కోట్ల రూపాయల చెక్కును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అందజేశారు. అనంతరం మహిళా రచయితలు, కవులు రాసిన మహాలక్ష్మి (మహిళా సాధికారత లో ప్రగతి చక్రాలు) పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మహిళా సమాఖ్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని.. ఇప్పటికే మహిళల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. త్వరలో మరిన్ని కార్యక్రమాలు చేస్తామని వెల్లడించారు. అవకాశాలు ఉన్న ప్రతీ దగ్గర వ్యాపారం కోసం మహిళా సమాఖ్యలకు ఇస్తామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరీమణులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను గ్రౌండ్ లెవెల్లో తెలిసేలా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈనెల 10 నుంచి 16 వరకు రాష్ట్ర వ్యాప్తంగా - మిగతా3లో



## సీఎం రేవంత్ విసిరిన సవాల్ కేటీఆర్‌కు అర్థం కానట్టుంది

హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు అర్థం కానట్టుందని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీలో చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరింది కేటీఆర్‌కు కాదని.. కేసీఆర్‌కు అని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత హోదా ఉన్న కేసీఆర్ చర్చకు రావాలన్నారు. భారత రాష్ట్ర సమితి ఇప్పటికే చచ్చిపోయిందని.. కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన చెల్లెలే అంగీకరించడం లేదన్నారు. కేటీఆర్ తమ నాయకుడే కాదని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారని సీతక్క పేర్కొన్నారు

## మరో 30-40 ఏళ్లు జీవించాలని ఆశగా ఉంది

- టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా
- మరికొన్నేళ్లు ఆరోగ్యంగా జీవించగలననే దేవుని స్పష్టమైన సంకేతాలు తనకు అందుతున్నాయి
- బుద్ధుని బోధనల వ్యాప్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా
- ప్రస్తుతం తనకు 90 ఏళ్లు నిండటంతో 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది

# హాస్పిటల్ నుంచి కేసీఆర్ డిశ్చార్జ్



- 'రాష్ట్రంలో పంటలెట్ల ఉన్నయ్? వానలు పడుతున్నాయా?
- నీళ్లు అందుతున్నాయా?'
- నీటి వాటాల సంగతి తేలుస్తా!
- పలకరించేందుకు వచ్చిన నేతలతో కేసీఆర్

హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ యశోద దవాఖాన నుంచి డిశ్చార్జ్ అయ్యారు. నందినగర్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. రొటీన్ హెల్త్ చెకప్‌లో భాగంగా గురువారం సాయంత్రం (ఈ నెల 3న) కేసీఆర్ యశోదా హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. బ్లడ్ షుగర్, సోడియం లెవెల్స్ మానిటర్ చేయడం కోసం ఒకటి, రెండు రోజులు హాస్పిటల్‌లో చేరాల్సిందిగా డాక్టర్లు సూచించారు. ఆరోగ్యపరంగా కేసీఆర్‌కు పెద్దగా ఇబ్బందులేమీ లేవని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్షల అనంతరం శనివారం ఉదయం హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యారు. 'కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన నీటి వాటాపై నేను త్వరలోనే స్పందిస్త.. ప్రజల - మిగతా3లో



## ట్రంప్ సుంకాలకు మోదీ తలొగ్గుతారు.. రాసి పెట్టుకోండి

- అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ట విధానాలను కలిగిఉంది
- 90 రోజుల విరామం తర్వాత అది అమల్లోకి రాకుండా ఉండేందుకు వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి భారత్ ప్రయత్నిస్తోంది.
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

# ప్రజలు ఆ రెండు పార్టీలకు బుద్ధి చెబుతారు



- ఆ రెండు పార్టీలపై తెలంగాణ బీజేపీ కొత్త బాస్ ఫైర్
- పార్టీ కోసం నేను చేసిన కృషికి దక్కిన గౌరవం ఇది
- నాకు ఇచ్చింది పదవి కాదు.. కార్యకర్తకు దక్కిన గౌరవం
- నలబై ఐదు లక్షల మంది కార్యకర్తలు ఉన్న పార్టీ బీజేపీ
- ప్రజలు ఇచ్చిన నమ్మకాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నిలబెట్టుకోలేదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రైతులను, విద్యార్థులను, నిరుద్యోగులను, మహిళలను మోసం చేశాయి

హైదరాబాద్

'పార్టీ కోసం నేను చేసిన కృషికి దక్కిన గౌరవం ఇది. నాకు ఇచ్చింది పదవి కాదు.. కార్యకర్తకు దక్కిన గౌరవం. లక్షలాది మంది కార్యకర్తలకు దక్కిన గౌరవం ఇది' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా రామచందర్ రావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నలబై ఐదు లక్షల మంది కార్యకర్తలు ఉన్న పార్టీ బీజేపీ అని తెలిపారు. ఎంతోమంది కార్యకర్తల త్యాగం ఉందన్నారు. దేశవ్యాప్తంగా 14 కోట్ల సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీ అని చెప్పుకొచ్చారు. ప్రజలు ఇచ్చిన నమ్మకాన్ని కాంగ్రెస్, - మిగతా3లో

# 20ఏళ్ల తర్వాత.. ఒకే వేదికపై ఠాక్రే సోదరులు



**ముంబయి:** విడిపోయిన అన్నదమ్ములు ఉద్ధవ్ ఠాక్రే రాజ్ ఠాక్రేలు దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికను పంచుకున్నారు. మహారాష్ట్రలో త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంతో ఇది ప్రతిపక్షాల విజయంగా పేర్కొంటూ.. నేడు ముంబయి వేదికగా 'వాయిస్ ఆఫ్ మరాఠీ' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో శివసేన యూబీటీ నేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన నేత రాజ్ ఠాక్రేలు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. ఛత్రపతి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 2005లో విడిపోయిన వీరు దాదాపు 20 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకోవడం మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారనుంది. ఈ కార్యక్రమంలో రాజ్ ఠాక్రే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం ద్వారా మన పిల్లలు సరైన విషయాలు నేర్చుకొనే అవకాశం లేకుండా పోతోందని మోదీ ప్రభుత్వం తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. దక్షిణ భారతదేశంలో ఎందరో సినీనటులు, రాజకీయ నాయకులు ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్నప్పటికీ తమ మాతృభాషలైన తెలుగు, తమిళం వంటి భాషల విషయంలో ఎంతో గర్వంగా ఉంటారన్నారు. అలాగే మహారాష్ట్ర నేతలకు, ప్రజలకు కూడా తమ భాషపై అభిమానం ఉంటుందని పేర్కొన్నారు. తమకు హిందీ భాషపై వ్యతిరేకత ఎప్పుడూ లేదని రాజ్ అన్నారు. అయితే ఇతరులపై ఆ భాషను బలవంతంగా రుద్దాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. తమ పూర్వీకులు మరాఠా సామ్రాజ్యాన్ని ఎన్ని ప్రాంతాలకు విస్తరించినప్పటికీ ఎప్పుడూ అక్కడి వారిపై మరాఠీని బలవంతంగా రుద్దలేదని రాజ్ పేర్కొన్నారు. కానీ కేంద్రప్రభుత్వం మాత్రం ఇతర రాష్ట్రాలపై త్రిభాషా సూత్రాన్ని ప్రయోగించాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికీ దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు, ఇతర హైకోర్టులలో అన్ని ఉత్తర్వులు ఆంగ్లభాషలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని ఈ విధానాన్ని మహారాష్ట్రపై రుద్దాలని చూస్తే.. ఏం జరుగుతుందో ఇప్పటికైనా కేంద్రం తెలుసుకోవాలని హెచ్చరించారు. తమను ఒకచోట చేర్చడం ఎవరికీ సాధ్యం కాలేదని.. చివరికి బాల్ ఠాక్రే సైతం చేయలేకపోయిన పనిని.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ రాష్ట్రానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడం ద్వారా చేశారని రాజ్ ఠాక్రే అన్నారు. అనుకోకుండానే ఆయన తమని ఒకే వేదిక పైకి తీసుకువచ్చారని అన్నారు. ఇకపై రాష్ట్ర ఐక్యత విషయంలో తాము ఎప్పటికీ ఒక్కటిగా ఉంటామని పేర్కొన్నారు.

# ట్రంప్ సుంకాలకు మోదీ తలొగ్గుతారు.. రాసి పెట్టుకోండి



**ఇంటర్నెట్ డెస్క్:** మూడు నెలల క్రితం భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. 90 రోజుల విరామం తర్వాత అది అమల్లోకి రాకుండా ఉండేందుకు వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని రాహుల్ పేర్కొన్నారు. ట్రంప్ సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని.. తన మాటలు నమ్మకపోతే రాసిపెట్టుకోవాలని వ్యాఖ్యానించారు. అమెరికా పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠ విధానాలను కలిగిఉందని స్పష్టం చేశారు. గడువు ఆధారంగా కీలకమైన వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకునేందుకు దేశం ఎప్పుడూ తొందరపడదని అన్నారు. రెండు వర్గాలకు లాభదాయకంగా ఉంటేనే అంగీకరిస్తుందన్నారు.

**నవ భారత్‌కు ఆకాశమూ హద్దు కాదు**

అమెరికాతో కుదుర్చుకోనున్న ఒప్పందంలో భాగంగా భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి అగ్రరాజ్యాన్ని సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ప్లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు), వైన్స్, పెట్రో కెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. అయితే ఈ సడలింపులను ఆమోదిస్తే, మన దేశంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నిత అంశమైనందున, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపులకు భారత్ ససేమిరా అంటోంది. వాణిజ్య చర్చల నిమిత్తం ఇటీవల అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగివచ్చింది. దీంతో అమెరికా–భారత్ మధ్య ఈనెల 9లోగా మధ్యంతర

# విపత్తు మిగిల్చిన విషాదం..!


# పాపం అనాథగా ఆ చిట్టితల్లి..



ప్రకృతి వైపరీత్యాలు ఎవ్వరికి ఎలాంటి విషాదాన్ని ఇస్తుందో చెప్పలేం. అమాంతం ఉప్పెనలా విరుచుకపడే ఆ విలయం మిగిల్చే బాధ మాటలకందనిది. అందుకు సంబంధించి ఎన్నో ఉదంతాలను చూశాం. అలానే ఇటీవల కురిసిన భారీ వర్షాలు హిమచల్ ప్రదేశాన్ని ఎంతలా అతలా కుతలం చేశాయో తెలిసిందే. అయితే దాని కారణంగా అనాథగా మారిన ఓ చిట్టితల్లి ఉదంతం ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇంతకీ ఆ చిన్నారి ఎలా బతికి బట్టగట్టకలిగిందంటే.. అసలేం జరిగిందంటే..ఎడతెరపిలేని వర్షాలకు వరదలు సంభవించి హిమచల్‌ప్రదేశ్ అతలాకుతలమైన సంగతి తెలిసింది. ఈ ప్రకృతి వైరిత్యం కారణంగా భారీగా ఆస్తి, జన నష్టం జరిగింది. అయితే ఈ దుర్ఘటనలో హిమచల్ ప్రదేశ్‌లోని సిరాజ్ అనే ప్రాంతంలో ఓ కుటుంబం మొత్తం ఈ విపత్తుకు బలైపోయింది. ఆ కుటుంబానికి చెందిన 11 నెలల కూతురు ఒక్కత్తే బతికి బట్టగట్టగలిగింది. ఈ విపత్తు కారణంగా ఒరిగిపోయిన చెట్లు, భవనాల శిథిలాలను తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బందికి ఆ చిన్నారి లభించడం విశేషం. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా వచ్చిన వరదలకు ఆ చిన్నారి ఇల్లు తుడిచిపెట్టుకుపోయింది. ఈ ఘటనలో ఆమె తల్లి, తండ్రి, నానమ్మ చనిపోగా, ఆ చిన్నారి ఒక్కత్తే అనాథగా మిగిలిపోయింది. ఇవేమి ఆ చిన్నారికి తెలియక అమాయకంగా అందరిని చూస్తున్న తీరు అందరిని కలచివేస్తోంది. శిథిలంగా మారిన ఆ ఇల్లు పర్వాడ గ్రామానికి చెందని రమేష్ ఇల్లుగా గుర్తించారు. ఆ ఇల్లు డ్రెయిన్ సమీపంలో ఉండటంతో, జూన్ 30న కురిసిన వర్షాలకు నీటి ఉధ్ధృతి ఎక్కువై కొట్టుకుపోయింది.

అయితే దీనిని ముందుగానే గమనించి రమేష్ కూతురిని ఇంటిలోపల పడుకోబెట్టి, తన భార్య తల్లితో కలిసి ఇంటి వెనకకు వెళ్లాడు. అంతే ఆ వరద ప్రవాహంలో ముగ్గురు కొట్టుకుపోయారు. ఐతే చిన్నారి ఇంటిలోనే ఉండటంతో సురక్షితంగా శిథిలాల కింద బిక్కుబిక్కుమంటూ ఏడుస్తూ ఉందని చెబుతున్నారు అధికారులు. ఆ చిన్నారి పేరు నిఖితగా గుర్తించారు. అయితే రెస్క్యూ సిబ్బంది ఆ చిన్నారి తండ్రి మృతదేహాన్ని వెలికితీశారు కానీ తల్లి, భార్య మృతదేహాలు మాత్రం కానరాలేదు. అందుకోసం ముమ్మరంగా గాలించేందుకు రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగినట్లు వెల్లడించారు అధికారులు. ప్రస్తుతం ఆ చిన్నారి మేనత్త తారాదేవి సంరక్షణలో ఉన్నట్లు తెలిపారు. ఈ హృదయవిదారక ఘటన గురించి నెట్టింట వైరల్ అవ్వడంతో ఆ చిన్నారిని దత్తత తీసుకుంటామంటూ సోషల్ మీడియాలో పెద్దఎత్తున అభ్యర్థనలు రావడం విశేషం. విత్తుల సహాయ నిర్వహణ అధికారి స్మృతికా నేగి ఆ చిన్నారి నికితా బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఆ చిన్నారి తన మేనత్త పర్యవేక్షణలో ఉందని తెలిపారు. కాగా, ఈ హిమచల్‌ప్రదేశ్ వర్ష బీభత్సానికి సుమారు 700 కోట్ల మేర

## చెక్కతో చేసిన సాధారణ కుర్చీలా చూడొద్దు



ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎమోషనల్ అయ్యారు. అక్కడి పార్లమెంట్‌కు హాజరైన మోదీ.. ఇరు దేశాల మధ్య అనుబంధం గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. ట్రినిడాడ్ అండ్ టొబాగోతో భారత్‌కు ఉన్న అనుబంధం, చారిత్రాత్మక సంబంధాల గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రసంగం మధ్యలో స్పీకర్ చెయిర్ గురించి ప్రస్తావించారు మోదీ. దీన్ని చెక్కతో చేసిన సాధారణ కుర్చీలా చూడొద్దని.. ఇది భారత్–ట్రినిడాడ్ అండ్ టొబాగో మధ్య ఉన్న స్నేహం, నమ్మకం, దృఢమైన ప్రజాస్వామ్య బంధానికి నిదర్శనమని తెలిపారు. ప్రధాని ప్రస్తావనతో అసలు ఈ కుర్చీకి ఉన్న చరిత్ర ఏంటో కనుక్కునేందుకు చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు. మరి.. చెయిర్ హిస్టరీ ఏంటో ఇప్పుడు చూద్దాం..

**ఇందిర హయాంలోనే..**

ఏళ్ల పాటు బ్రిటీష్ పాలనలో ఉన్న ట్రినిడాడ్ అండ్ టొబాగోకు 1962లో విముక్తి లభించింది. దీంతో ఈ దేశానికి 1968లో ఓ ప్రత్యేక బహుమతిని పంపించింది భారత ప్రభుత్వం. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ.. పార్లమెంట్‌లో స్పీకర్ కూర్చునేందుకు ఓ ప్రత్యేక కుర్చీని తయారు చేయించి ట్రినిడాడ్ అండ్ టొబాగోకు గిఫ్ట్‌గా పంపించారు. ఫిబ్రవరి 8వ తేదీ, 1968న భారత హైకమిషనర్ మునీలాల్ ఈ కుర్చీని అక్కడి ప్రభుత్వానికి అందజేశారు. ఇరు దేశాల మధ్య బంధం మరింత బలపడేందుకు ఇది దోహదపడింది. అలాంటి కుర్చీని, ట్రినిడాడ్‌తో భారత్‌కు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ తాజాగా ఎమోషనల్ అయ్యారు మోదీ.

**180 ఏళ్ల కిందే..**

ట్రినిడాడ్ అండ్ టొబాగోకు 180 ఏళ్ల కిందే భారతీయులు వచ్చారని ప్రధాని మోదీ తెలిపారు. సుదూర ప్రయాణాలు చేస్తూ, సముద్రాలు దాటి ఇండియన్స్ ఇక్కడికి చేరుకున్నారని చెప్పుకొచ్చారు. కరీబియన్ నేలతో తమకు గట్టి అనుబంధం ఏర్పడిందని, ఇక్కడివారితో భారతీయులు చాలా బాగా కలసిపోయారని పేర్కొన్నారు. రాజకీయాల దగ్గర నుంచి కవిత్వం, క్రికెట్, వ్యాపారం వరకు.. ప్రతి విభాగంలో భారతీయులు భాగస్వాములు అవుతూ కీలకపాత్ర పోషిస్తున్నారని మెచ్చుకున్నారు మోదీ.

## మరో 30-40 ఏళ్లు జీవించాలని ఆశగా ఉంది



**ఇంటర్నెట్ డెస్క్:** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని..ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తన మనసులోని మరో విషయాన్ని బయటపెట్టారు. జులై 6న తన 90వ పుట్టిన రోజు వేడుక నిర్వహించుకోనున్న నేపథ్యంలో.. ఆయన అనుచరులు దలైలామా దీర్ఘాయుష్షు కోసం పలు ప్రార్థనలు నిర్వహించారు. అందులోభాగంగా టిబెట్ బౌద్ధమత గురువు మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేస్తూ మరో 30–40 ఏళ్లు జీవించాలని ఉందనే తన ఆకాంక్షను వ్యక్తంచేశారు. మరికొన్నేళ్లు ఆరోగ్యంగా జీవించగలననే దేవుని స్పష్టమైన సంకేతాలు తనకు అందుతున్నాయన్నారు. బుద్ధుని బోధనల వ్యాప్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గతంలోనూ దలైలామా తన ఆయుష్షు గురించి మాట్లాడుతూ..తాను 110 ఏళ్లు జీవిస్తానని ఓ కల వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు 90 ఏళ్లు నిండటంతో 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని ఇటీవల టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..?అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్నివర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకొనే అధికారం ఎవరికీ లేదని చైనాను ఉద్దేశించి అన్నారు. కాగా.. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావిస్తోంది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని (పునర్జన్మ పొందిన బాలుడిని) ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు.

## ఆయన ప్రజలను చంపుతూనే ఉంటారు

## పుతిన్ తీరుపై ట్రంప్ అసహనం



ఇంటర్నెట్‌డెస్క్: ఉక్రెయిన్‌పై రష్యాతో యుద్ధ విరమణ చేయించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నానాతంటాలు పడుతున్నారు. ఆ దిశగా ఎలాంటి పురోగతి లేకపోవడంతో అసహనం వ్యక్తంచేస్తోన్న ఆయన.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై పరుష వ్యాఖ్యలు చేశారు అలాగే మాస్కోపై మరిన్ని ఆంక్షలు ఉండొచ్చని బెదిరింపులకు పాల్పడ్డారు. "ఆయన (పుతిన్) అంతే. మనుషులను చంపుతూనే ఉండాలని కోరుకుంటున్నారు. అది ఏమాత్రం మంచిదికాదు" అని మీడియా ఎదుట ఆగ్రహం వ్యక్తంచేశారు అమెరికా కాలమానం ప్రకారం గురువారం ఉదయం 10 గంటలకు ఉక్రెయిన్ యుద్ధం తదితర అశాలపై పుతిన్–ట్రంప్ సుమారు గంటసేపు చర్చలు జరిపారు. ఇంత చేసినా వారు ఏ నిర్ణయానికి రాలేదు. ఈ విషయాన్ని స్వయంగా ట్రంప్ ఆ తర్వాత అంగీకరించారు. ఈ విషయంపై జర్నలిస్టులతో ఆయన చెబుతూనే.. "మేము ఈ రోజు ఎటువంటి పురోగతి సాధించలేదు. ఫోన్‌కాల్‌లో సుదీర్ఘంగా మాట్లాడుకొన్నాం. ఇరాన్ విషయం సహా పలు అంశాలపై మాట్లాడుకొన్నాం. మీకు తెలుసు కదా ఉక్రెయిన్ అంశం చర్చకు వచ్చింది. ఆ విషయంలో నేను ఏమాత్రం సంతృప్తిగా లేను. ఏమాత్రం పురోగతి సాధించలేదు" అని ట్రంప్ నిరాశ వ్యక్తంచేశారు. యుద్ధంలో రష్యా ఓడితే అమెరికా మాపై దృష్టి పెడుతుంది: చైనా భయాన్ని నిక్కచ్చిగా చెప్పేసిన విదేశాంగ మంత్రి

ఆ అంశంపై పుతిన్ సహాయకుడు యూరీ ఉషోవ్ మాట్లాడుతూ ఇరువురు నాయకులు సూటిగా చర్చించుకొన్నారు. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టాలని ట్రంప్ సూచించినా.. పుతిన్ మాత్రం తిరస్కరించారు. ఈ యుద్ధానికి కారణమైన అంశాల్లో రష్యా లక్ష్యాలను సాధించడానికి కట్టుబడి ఉన్నట్లు తేల్చిచెప్పారు. అదే సమయంలో దౌత్య మార్గంలో అంతిమంగా పరిష్కరించుకొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. యుద్ధ విరమణ కోసం ట్రంప్–పుతిన్ చర్చించుకోవడం ఇది ఆరోసారి. ఉక్రెయిన్‌పై

# మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజలదన్నారు. కుటుంబ పెద్దలు ఆర్థికంగా ఎదిగేలా చేస్తే.. రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా అభివృద్ధిలో తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**నష్టాల నుంచి లాభాల్లోకి ఆర్టీసీ: మంత్రి పొన్నం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ మరోసారి బతికిందన్నారు. త్వరలోనే దాదాపు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసిన రికార్డు నమోదు కాబోతుందని తెలిపారు. 6500 కోట్ల రూపాయల విలువైన ఉచిత ప్రయాణం నమోదు కాబోతుందని.. ఈ డబ్బులను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామ గ్రామాన సంబరాలు నిర్వహించాలని



పిలుపునిచ్చారు. ఈ మహాలక్ష్మి పథకం విజయవంతం కావడం కోసం డ్రైవర్లు, కండక్టర్‌లు చాలా కష్టపడుతున్నారని వారికి అభినందనలు తెలియజేశారు. ఆర్టీసీలో కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని.. కొత్త నియామకాలు చేస్తున్నామని చెప్పారు. మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ ఉచిత బస్సును వాడుకుంటున్నారన్నారు. ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వెళ్తోందని మంత్రి ప్రభాకర్ వెల్లడించారు.

**మహిళల ఎదుగుదలే సమాజ ఎదుగుదల: మంత్రి సీతక్క**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 24 గంటల్లోపే మహిళలకు ఉచిత బస్సు పథకం తెచ్చిందని మంత్రి సీతక్క అన్నారు. ఉచిత ప్రయాణమే కాదు మహిళలను బస్సులకు ఓనర్లను చేసిందన్నారు. మహిళల ఎదుగుదలనే సమాజ ఎదుగుదల అని చెప్పుకొచ్చారు. ఆ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గతంలో పావలా వడ్డీ రుణాలు ఇవ్వలేదని.. వడ్డీలేని రుణాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళల అనుభవాలను తెలిపే పుస్తకం ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. మండల సమాఖ్యలో ఉన్న మహిళల కోరికలు నెరవేరుతున్నాయన్నారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని మంత్రి చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి 25 వేల కోట్ల రుణాలను మహిళా సంఘాలు పొందాయని పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లిస్తుండడంతో బ్యాంకులు ఇబ్బందులు లేకుండా రుణాలు ఇస్తున్నాయన్నారు. మహిళలందరూ ఎల్లుండి నుంచి సంబరాలు చేయాలని..

## కేటీఆర్, హరీశ్ సెకండ్ బెంచ్ లీడర్స్..

# వీళ్ల జోక్యం అవసరం లేదు

తెలంగాణలో రాజకీయాలు ప్రస్తుతం హాట్ హాట్?గా కొనసాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి రైతు సంక్షేమంపై నిన్న చేసిన సవాల్?పై కేటీఆర్ స్పందించడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై ఇప్పటికే మంత్రి సీతక్క సహా పలువురు స్పందించగా, తాజాగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రియాక్ట్ అయ్యారు. ఈ క్రమంలో కేసీఆర్, రేవంత్ లాంటి ఫస్ట్ బెంచ్ నాయకుల మధ్య జరిగే చర్చల్లో కేటీఆర్, హరీశ్ రావు వంటి సెకండ్ బెంచ్ నాయకుల జోక్యం అవసరమా అని ఎద్దేవా చేశారు. ఎందుకంటే రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రమ్మని కేసీఆర్?కు సవాల్ చేస్తే, కేటీఆర్ క్లబ్?కు రా అని సమాధానం ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇది వారి మధ్య ఉన్న రాజకీయ నైపుణ్యాన్ని స్పష్టంగా చూపిస్తుందన్నారు జగ్గారెడ్డి. కేసీఆర్ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా, పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ జాతీయ పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈ ఇద్దరి మధ్య రాజకీయ పోరు ఎప్పుడూ



ఉంటుంది. కానీ వీరి మధ్యలో కేటీఆర్ ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

**కేసీఆర్ వైఖరి ఏంటి..**

అంతేకాదు కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యేందుకు గతంలో ఆంధ్ర నాయకులు, ఆంధ్ర ప్రజలపై కూడా తీవ్ర విమర్శలు చేశారని జగ్గారెడ్డి గుర్తు చేశారు. ఆంధ్రోళ్లను దొంగలని, నీళ్లను ఎత్తుకెళ్లారని ఎన్నో అన్నారని చెప్పారు. కానీ కేసీఆర్ సీఎం అయిన తర్వాత జగన్‌మోహన్ రెడ్డిని ఎందుకు ఇంటికి పిలిచాడని పేర్కొన్నారు. ఈ విషయంలో కేసీఆర్ రాజకీయ వైఖరి ఏంటో స్పష్టంగా తెలుస్తుందని జగ్గారెడ్డి తెలిపారు.

**ఉద్యమ సమయంలో కూడా..**

రేవంత్ రెడ్డి సవాళ్లపై కేటీఆర్ ప్రెస్ మీట్‌లు రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపవన్నారు. కేటీఆర్ రాజకీయంగా రేవంత్‌తో సమానంగా తలపడాలంటే, బీఆర్ఎస్ ప్రతిపక్ష హోదాను కేసీఆర్ నుంచి తీసుకుని మాట్లాడాలని జగ్గారెడ్డి అన్నారు. మరోవైపు తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించినట్లు గుర్తు చేశారు జగ్గారెడ్డి. సోనియా గాంధీ ఉద్యమకారులపై ఒక్క బుల్లెట్ కూడా పడకూడదని చెప్పారని, కేసీఆర్‌ను నిమ్స్‌లో చేర్చి, ఉద్యమానికి మద్దతు ఇచ్చింది కూడా కాంగ్రెస్ అని వెల్లడించారు. చివరకు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీనేనని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# 72 గంటల్లో రా.. తేల్చుకుందాం..

## రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్

**హైదరాబాద్:** రైతు సంక్షేమం గురించి చర్చించేందుకు తెలంగాణలో ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 72 గంటల్లో రా.. తేల్చుకుందామని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో చర్చకు సిద్ధమని చెప్పారు. చర్చకు మూడు రోజుల సమయం ఇస్తున్నామని, ప్రిపేర్ అయ్యి రావాలన్నారు. లేదంటే చర్చకు వచ్చి బేసిన్లు, బెండకాయలు అంటే ఇజ్జత్ పోతుందని ఎద్దేవా చేశారు. పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణలో రైతు రాజ్యం తెచ్చింది కేసీఆర్. రైతు కేంద్రంగా ప్రభుత్వాన్ని నడిపింది బీఆర్ఎస్. నిజం తెలిసినా ఒప్పుకోలేని వ్యక్తి రేవంత్ రెడ్డి. సభ పెడితే బూతులు మాట్లాడుడే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నాడు. రైతు సంక్షేమంపై రేవంత్ రెడ్డి ఎక్కడ చర్చ పెట్టినా మేం రెడీ. 72 గంటలు సమయం ఇస్తున్నా.. ప్రిపేర్ అయ్యి చర్చకు రండి. రేవంత్ రెడ్డికి బేసిన్ తెలవదు, బెండకాయ తెల్వదు. దేవాదుల గోదావరి బేసిన్‌లో ఉందా అని అడుగుతడు. నల్లమల పులి అంటాడు.. మళ్లీ నల్లమల తెలంగాణలోనే ఉందా అని అంటడు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణ ఉద్యమాన్ని నడిపాం. రేవంత్ రెడ్డి వచ్చాక నీళ్లను ఆంధ్రాకు, నిధులను ఢిల్లీకి పంపుతున్నారు. తన అనుచరులకు నియామకాలు ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం చేసినట్లు రైతులకు ఎక్కడా, ఎవరూ చేయలేదు. 70 లక్ష మంది రైతుల ఖాతాల్లో నిధులు జమచేశాం. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. రైతుకు పెట్టుబడి, ఉచిత విద్యుత్, వాగులు నిపింన ఘనత కూడా కేసీఆర్‌దే. రైతు చనిపోతే రూ.5 లక్షల బీమా ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే. దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో చెరువులను ధ్వంసం చేశారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులకు జీవం పోశాం. రూ.30 వేల



కోట్ల విలువైన మత్స్య సంపద సృష్టించాం. రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణిగా మార్చింది కేసీఆర్ కాదా?. 75 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత వ్యవసాయ రంగానికి కేసీఆర్ చేసినంత ఎవరూ చేయలేదు. ఎరువుల పంపిణీ చేతకాని మీరు.. కేసీఆర్‌ను చర్చకు పిలుస్తారా?. యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎరువులు, విత్తనాల కోసం లైన్లలో చెప్పులు పెట్టడమేనా ఇందిరమ్మ రాజ్యం అంటే. ఆసిఫాబాద్ జిల్లాలో రైతులు ఎరువల కోసం యుద్ధాలు చేస్తున్నారు. ఆధార్ కార్డు చూపిస్తే రైతుకు ఒక బస్తా యూరియా ఇవ్వాలని ఆదేశించారు. రైతుల ఆత్మహత్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చింది రేవంత్ రెడ్డి కాదా. వాగులు, వంకలు నింపిన ఘనత కేసీఆర్‌ది. బోనస్ ఇవ్వకుండా ఎగ్గొట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ రైతు బీమా తీసుకొచ్చారు. ఆ రైతు బీమాను ఎగ్గొట్టింది రేవంత్ రెడ్డి కాదా?. కేసీఆర్ దేశంలోనే తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా మార్చారు. కిందికి నీళ్లను తీసుకెళ్తుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు హారతలు పట్టారు. గోదావరి, కృష్ణా నీటిని ఒడిసిపట్టి కోటి ఎకరాల మాగాణం చేసింది కేసీఆర్ కాదా?. ఇదంతా తెలంగాణ రైతాంగానికి తెలియదా. మీ గురువు చంద్రబాబు బనకచర్ల ద్వారా నీళ్ల దోపిడీకి పాల్పడుతున్నాడు. చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్నదెవరో ప్రజలకు తెలియదా. నల్లగొండ జిల్లాను ఫ్లోరైడ్ నుంచి విముక్తి కల్పించింది కేసీఆర్ కాదా. రెండు దఫాలుగా కేసీఆర్ రైతు రుణమాఫీ చేశారు. కరోనా, నోట్ల రద్దును తట్టుకుని రూ.34 వేల కోట్ల రుణమాఫీ చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఒక్కదైనా అమలు చేశారా. ఒకేసారి రుణమాఫీ చేస్తామని చెప్పారు.. చేశారా?. రేవంత్ రెడ్డి ఎక్కడ చర్చకు రావాలో ప్లేస్, డేట్ చెప్పు.. నువ్వు పారిపోతే మేం టైమ్, ప్లేస్ చెబుతున్నాం.. చర్చకు రా. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 8 తారీఖునాడు చర్చకు సిద్ధం. ఉదయం 11 గంటలకు సమయం ఇస్తున్నాం. వస్తవా.. పారిపోతావో నువ్వే తేల్చుకో. నాలుగు పంటలకు రైతుభరోసా ఎగ్గొట్టి పండుగ చేసుకోమంటున్నవు. రైతు భరోసాకు రూ.15 వేలు ఇస్తున్నవా?. కౌలు రైతులకు లేఖలు రాసి ఇప్పుడెందుకు పైసలు ఇస్తలేవు?. రైతు బంధులో మొత్తం రూ.39 వేల కోట్లు ఎగ్గట్టారు. మొదటి విడుతలో రూ.15 వేలు అని చెప్పి రూ.10 వేలే వేశారు. ఎన్నికల వరకే రైతుభరోసా ఇస్తాడు. తర్వాత మొత్తం బంద్ పెడుతారు. ఒక్కో రైతుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.19 వేలు బాకీ ఉంది. రైతు రుణమాఫీ రూ.12 వేల కోట్లు మాత్రమే చేశారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వలేదు. 30 శాతం వడ్లు మాత్రమే కొనుగోలు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రారంభమైన ఉద్యోగ ప్రక్రియకు అపాయింట్‌మెంట్ ఉద్యోగాలు ఇచ్చాడు. మందికి పుట్టిన బిడ్డను మా బిడ్డ అని చెప్పుకుంటున్నాడు. అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్, రేవంత్ రెడ్డి చర్చకు రావాలి. రూ.2500 కోసం కోటీ 40 లక్షల మంది మహిళలు ఎదురు చూస్తున్నారు. స్కూటీల కోసం విద్యార్థినిలు ఎదురు చూస్తున్నరు. రేవంత్ రెడ్డి తెలంగాణను పే సీఎం.. పే ఢిల్లీ

## రాజాసింగ్‌ను వదిలించుకోనున్న బీజేపీ!?..

## గోషామహల్‌లో కూడా ఉప ఎన్నిక?

**హైదరాబాద్ :** పంటి కింద రాయిలా పరిణమించిన గోషా మహల్ శాసనసభ్యుడు రాజాసింగ్‌ను వదిలించుకోవాలని బీజేపీ భావిస్తున్నట్టు తెలుస్తున్నది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక తీరుపై కేంద్ర నాయకత్వం మీద నిరసన గళం విప్పిన రాజాసింగ్ ఏకంగా పార్టీకి రాజీనామా చేస్తూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ లేఖ ఆధారంగా స్పీకర్‌కు లేఖ రాసి తన అసెంబ్లీ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయించాలని మాట్లాడారు. తాను ఇక ఏమాత్రం బీజేపీ సభ్యుడిని కానని కూడా ప్రకటించారు. దీంతో ఇదే అదునుగా ఆయనను పార్టీ నుంచి బయటకు పంపాలని రాష్ట్రంలోని పలువురు నేతలు పావులు కదుపుతున్నట్టు తెలిసింది. పలుమార్లు పార్టీని, పార్టీ నేతలను ఇరుకున పెట్టేలా వ్యవహరించిన రాజాసింగ్‌ను వదిలించుకోవడానికి ఇదే కలిసి వచ్చిన సమయమని వారు భావిస్తున్నట్టు సమాచారం. ఇంకెంతకాలం ఆయనను భరించాలని పలువురు నేతలు పార్టీ అధిష్ఠానం పెద్దల వద్ద ప్రస్తావించినట్టు తెల్సింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, సంస్థాగత వ్యవహారాల జాతీయ కార్యదర్శి తదితరులకు ఇదే విషయాన్ని రాష్ట్ర పార్టీ నివేదించినట్టు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర పార్టీ కేంద్ర పార్టీకి ఒక లేఖను కూడా పంపినట్టు తెలిసింది. లేఖపై సంతకం చేసిన వారిలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్, కొత్త అధ్యక్షుడు రాంచందర్‌రావు సహా ముఖ్య నేతలంతా ఉన్నట్టు చెప్తున్నారు. కేంద్ర నాయకత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ ఇస్తే స్పీకర్‌కు రాజాసింగ్‌పై పార్టీ నిర్ణయాన్ని వివరిస్తూ లేఖ రాయాలని నిర్ణయించినట్టు తెలిసింది. పార్టీ ఆదేశాలు వస్తే అప్పుడు స్పీకర్‌కు లేఖ ఇస్తామని బీజేపీకి చెందిన కీలక నేత ఒకరు 'నమస్తే తెలంగాణ'తో ధ్రువీకరించారు. ఒకవేళ బీజేపీ కేంద్ర నాయకత్వం సమ్మతిస్తే జూలై నెలాఖరులోపే రాజాసింగ్ వ్యవహారం తేలిపోతుందని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. పార్టీతోపాటు అసెంబ్లీ స్పీకర్ కూడా ఆయన రాజీనామాను ఆమోదిస్తే గోషామహల్‌లో ఉప ఎన్నిక తప్పదని తెలుస్తున్నది. జూబ్లీహిల్స్‌తోపాటే గోషామహల్‌కు కూడా ఉప ఎన్నిక జరిగే అవకాశాలు ఉంటాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు అక్టోబర్‌లో షెడ్యూల్ విడుదల కానుంది. అప్పుడే రాష్ట్రంలోని ఈ రెండు నియోజకవర్గాలకు కూడా ఉప ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్

## రండి.. కలిసికట్టుగా ముందుకు సాగుదాం

-మొదటిపేజీ తరువాయి

చెప్పుకొచ్చారు. ఫోక్సో చట్టం, జువెనైల్ చట్టాలు మన ప్రగతిశీల సాధనాలుగా పనిచేస్తున్నాయని... అయితే ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాఘతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. న్యాయం కేవలం కోర్టుల్లోనే కాకుండా ప్రతీ దశలోనూ రక్షణ ఉండాలని సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో అన్ని ప్రక్రియల ద్వారా పిల్లలకు న్యాయం దక్కాలని.. రక్షణ కల్పించాలని తెలిపారు. 'న్యాయమూర్తులు, పోలీసు అధికారులు బాలల సంక్షేమ కమిటీలు, ఇతర అభివృద్ధి భాగస్వామ్య సభ్యులందరికీ... విజ్ఞప్తి చేస్తున్నాను. ఇలాంటి విషయాల్లో అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం. న్యాయమంటే కేవలం శిక్షలు విధించడం వరకే కాదు. బాధితుల జీవితానికి భరోసా కల్పించాలి. వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు తీసుకుని వారి బాల్యాన్ని తిరిగి పొందేలా చర్యలు ఉండాలి' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రజలు ఆ రెండు పార్టీలకు బుద్ధి చెబుతారు

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీలు నిలబెట్టుకోలేదని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రైతులను, విద్యార్థులను, నిరుద్యోగులను, మహిళలను మోసం చేశాయని మండిపడ్డారు. నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి తన నిస్సహాయతను ఒప్పుకున్నారన్నారు. రైతాంగాన్ని మోసం చేస్తే వాళ్ల ఉసురు తగులుతుందని వ్యాఖ్యలు చేశారు. లోకల్‌బాడీ ఎన్నికల్లో ప్రజలు ఆ రెండు పార్టీలకు బుద్ధి చెబుతారని అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత రేవంత్ రెడ్డికి కనబడటం లేదని.. దీని మీద బీజేపీ చర్చకు సిద్ధమని.. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ మీద ఆరోపణలు చేసే ముందు వారు పునరాలోచన చేసుకోవాలని హితవుపలికారు. ఖర్గే, రేవంత్ , కాంగ్రెస్ పెద్దలు తెలుసుకోవాల్సిన విషయం ఏంటంటే ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా చీటింగ్ కమిటీ అంటూ కామెంట్స్ చేశారు. నెక్స్ట్ ప్రభుత్వం బీజేపీదే అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీకి ప్రజలు 90 సీట్లు ఇవ్వబోతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. జీహెచ్ఎంసీలో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లు రెండేనని ఎద్దేవా చేశారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసిన ఘనత బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలదంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విరుచుకుపడ్డారు.

## హాస్పిటల్ నుంచి కేసీఆర్ డిశ్చార్జ్

-మొదటిపేజీ తరువాయి

ముందు వాస్తవాలను పెడుత' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. స్వల్ప అస్వస్థతతో సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో చేరిన కేసీఆర్ ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. శుక్రవారం తనను కలిసేందుకు వచ్చిన పార్టీ ముఖ్యనేతలతో మాట్లాడారు. ఉదయం, సాయంత్రం పార్టీ నేతలతో ముచ్చటించారు. దవాఖానలో ఉన్నా తనను కలవడానికి వచ్చిన నేతలతో రాష్ట్ర ప్రజలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపైనే ఆయన చర్చించడం గమనార్హం. ముఖ్యంగా రైతుల గురించి ఎక్కువ సమయం నేతలతో మాట్లాడారు.

పంటలెట్ల ఉన్నయి? వానలు పడుతున్నయా?

పలకరించేందుకు వచ్చిన నేతలతో కేసీఆర్ మాట్లాడుతూ 'రాష్ట్రంలో పంటలెట్ల ఉన్నయి? వానలు పడుతున్నాయా? నీళ్లు అందుతున్నాయా?' అంటూ విచారించారు. యూరియా అందడం లేదని చాలాచోట్ల రైతులు చెప్తున్నారని పలువురు నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. అనేక ప్రాంతాల్లో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం దాదాపు చేతులెత్తేసిందని నేతలు తమ తమ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితుల గురించి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఏనాడూ ఇలాంటి ఇబ్బందికర పరిస్థితి రాలేదని రైతులే చెప్తున్నారని, ఈసారి విత్తనాలు, ఎరువుల కొరత తీవ్రంగా ఉన్నదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని కొంత మంది నేతలు చెప్పారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటా గురించి ప్రభుత్వం చేస్తున్న వితండ, అర్థం, పర్థంలేని వాదన గురించి చర్చకు రాగా దీనిపై త్వరలోనే తాను స్పందిస్తానని, ప్రజల ముందు వాస్తవాలను పెడ్తానని కేసీఆర్ చెప్పారు. తెలంగాణ ఉద్యమం, కొత్త రాష్ట్రం ఏర్పాటు.. తర్వాత ప్రభుత్వం ఎదుర్కొన్న సవాళ్లు వంటివాటిని నాయకుల వద్ద కేసీఆర్ గుర్తు చేశారు.

## జీహెచ్ఎంసీ అధికారులపై



## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని శ్రీకృష్ణనగర్ బస్తీలో శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటించారు. స్థానిక కమ్యూనిటీ హాల్ సీ బ్లాక్‌లో ఇళ్ల ముందు పెద్ద ఎత్తున మురుగునీరు పారుతుండటంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు కిషన్‌రెడ్డి ఎదుట వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో తీవ్ర ఆగ్రహం చెందిన ఆయన.. జీహెచ్ఎంసీ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడారు. వెంటనే మురుగు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. 'మీ ఇంటి ముందు ఇలా మురుగు ఉంటే ఒక్క నిమిషమైనా ఉండగలరా?' అని తీవ్రంగా మందలించారు. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలన్నారు.

## ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి తగ్గకుండా చర్యలు

## తీసుకోవాలి: సింగరేణి సీఎండీ బలరాం

**హైదరాబాద్:** వర్షాకాలంలో ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి తగ్గకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను సింగరేణి సీఎండీ బలరామ్ ఆదేశించారు. జులై నెలకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించడం కోసం రోజుకు 2.15 లక్షల టన్నుల బొగ్గు రవాణా, 1.80 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. సింగరేణి పరిధిలోని ఏరియాల ప్రగతిపై సంబంధిత జీఎంలతో సీఎండీ సమీక్షించారు. వర్షాకాలంలో ఉత్పత్తికి అవరోధంగా ఉన్న అంశాలపై చర్చించి జీఎంలకు అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. బొగ్గు నాణ్యతా ప్రమాణాల పెంపుదలకు తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా అధికారులతో చర్చించారు. ఇల్లందు జేకే కోల్ మైన్, గోలేటి కోల్ మైన్‌కు సంబంధించిన పర్యావరణ, అటవీ అనుమతులకు ప్రయత్నాలు మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. వినియోగదారులకు ఇస్తామన్న గ్రేడ్ బొగ్గును సరఫరా చేయడానికి ప్రతి ఏరియాలో సీహెచ్‌పీలతో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్మికుల రక్షణకు సంబంధించి గనుల్లో రక్షణ ఆడిట్‌లను నిర్వహించాలన్నారు. ఎక్కడా


# సంగీత సరస్వతి బాల మురళీ

ప్రపంచ ప్రజల భాష సంగీతం. మనసును కదిలించేది, మనిషిలో చైతన్యాన్ని రగిలించేది సంగీతం. శిశుర్వేత్తి... పశు ర్వేత్తి... వేత్తిగాన రసఃఫణిః అని సంగీత ప్రాధాన్యత గురించి చెప్పారు. అవధు లెరుగనిది..ఎల్లలు ఒల్లనిది...భాషా భేదాలు లేనిది...ప్రాంతీయతలు తెలియనిది సంగీతం ఒక్కటే. కర్నాటక సంగీతం అనగానే వెంటనే స్ఫురణకు వచ్చే పేరు మంగళంపల్లి బాల మురళీకృష్ణ. సంగీతాన్ని ఔపోసన పట్టిన మహానుభావుడు బాలమురళి. కీర్తనలు, ఎంకి పాటలు, తత్వాలు, లలిత గీతాలు, భక్తి గీతాలు ఆయన పాడింది పాట, ఆలపించింది రాగం అన్నట్లుగా ఉంటుంది. వేలాది కాసెట్లు, రికార్డు విడుదల చేశారు. బాలమురళీ కేవలం గాయకులే కాదు, వాగ్గేయకారులు కూడా. 72 మేళకర్తల్లో కీర్తనలు రచించిన వాగ్గేయకారుడు ఆయన. లవంగి, త్రిశక్తి, మహతి లాంటి పెక్కు రాగాలు సృష్టించిన సంగీత సరస్వతి. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ 3 జాతీయ పురస్కారాలూ పొందిన ఏకైక వ్యక్తి బాలమురళీకృష్ణ. మంగళంపల్లి బాలము రళీకృష్ణ (జూలై 6, 1930 – నవంబర్ 22, 2016) కర్ణాటక సంగీత గాయకులు, వయొలిన్ విద్వాంసులు, వాగ్గేయ కారులు, సినీ సంగీత దర్శకులు, నటులు, గాయకులు. 8 సంవత్సరాల అతి చిన్న వయసులోనే కచేరీ చేయడం ద్వారా బాలమేధావి అనిపించు కున్నారు. 1939నుంచీ అతను ప్రొఫెషనల్ కచేరీలు చేశారు. వయోలిన్, మృదంగం, కంజీరా లాంటి వాయిద్యాలన్నీ బాగా వాయించ గలిగేవారు. భక్తప్రహ్లాద సినిమాలో నారదుడిగా, సందెని సింధూరం అనే మలయాళం సినిమాలో నటించారు. పలు చిత్రాలకు సంగీతాన్ని అందించారు. ప్రపంచ స్థాయిలో చేవెలియర్ అఫ్ ఆర్డర్ అఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్ గౌరవాన్ని ఫ్రాన్స్ ప్రభుత్వం నుండి అందుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 25 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. 1930, జూలై 6న మద్రాసు రాష్ట్రం లోని, తూర్పు గోదావరి జిల్లా, రాజోలు తాలూకా శంకర గుప్తంలో పట్టాభిరామయ్య, సూర్యకాంతమ్మ దంపతులకు జన్మించారు. తండ్రి స్వగ్రామం సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెం. పుట్టిన 15వ రోజునే తల్లి సూర్యకాంతం మరణించడంతో అమ్మమ్మగారి ఊరు అయిన గుడిమెళ్ళంకలో తండ్రి ఆలనా పాలనలో పెరిగారు. చిన్నతనంలోనే అతనిలోని సంగీత ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. కొచ్చర్లకోట రామరాజు ఆయన మొదటి గురువు. తరువాత తమిళనాడులో పక్షితీర్థానికి చెందిన సుబ్రహ్మణం అయ్యర్ దగ్గర కొన్నాళ్ళు శిష్యరికం చేసి, మళ్ళీ పెద్దకల్లేపల్లికి వచ్చి సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి వద్ద చేరారు. తదనంతరం ఆయన శిష్యుడైన పారుపల్లి రామకృష్ణయ్య



పంతులు దగ్గర ఉన్నత స్థాయి సంగీతం నేర్చుకుని విజయవాడలో స్థిరపడ్డారు. ఆయన ప్రముఖ సంగీతకారుడు, వేణువు, వయోలిన్, వీణ విద్వాంసుడు. వయోలిన్ టీచర్ గా శంకర గుప్తంలో సంగీత తరగతులు నిర్వహించేవారు. 1938 జూలైలో ఎనిమిదేళ్ళ ప్రాయంలో విజయవాడలో తమ గురువు పారుపల్లి రామకృష్ణయ్య, ఆయన గురువు సుసర్ల దక్షిణామూర్తి పేరున ఏర్పాటు చేసిన సద్గురు ఆరాధనోత్సవాల సందర్భంగా మొట్టమొదటి సారిగా కచేరి చేశారు. అదే కార్యక్రమంలో ఆయన గానానికి ముగ్ధుడైన హరికథ విద్వాంసుడు ముసునూరి సత్యనారాయణ ఆయన పేరు మురళీకృష్ణకు ముందు బాల అని చేర్చి బాలమురళీకృష్ణ అని పిలిచారు. తన చిన్నప్పుడు గురువు పారుపల్లి రామక్రిష్ణయ్య వెంట తమిళనాడు అంతా తిరిగారు. అప్పట్లో ప్రతి ఊళ్ళోనూ రసికమణి అని పేరుమోసిన ఒక ధనవంతుడైన సంగీత ప్రియుడుండేవారు. ఆయన మెప్పు పొంది, వాళ్ళింటో కచేరీ చేస్తేనే యువ కళాకారులకి గౌరవం దక్కేది. చిన్నవయసులో గురువు వెంట వెళ్ళిన బాలమురళి వారందరి ముందరా గాత్రం వినిపించి బహుమతులూ, ప్రశంసలూ పొందడంతో అనేక స్థానిక అవకాశాలు లభిస్తూ ఉండేవి. బాలమురళీకృష్ణ తన వృత్తి జీవితాన్ని చాలా చిన్న వయసులో ప్రారంభించారు. సంగీతంలోని అన్ని విభాగాలలోను విస్తారమైన పాండిత్యము, మంత్రముగ్దులను చేసే గాత్రం, బాణీ సమకూర్పులో ప్రత్యేక శైలి అతన్ని సంగీత సామ్రాజ్యంలో అత్యున్నత శిఖరాలకు చేర్చింది. హిందుస్తానీ సంగీతంలోని సంగీత కారులతో కలిసి పని చేశారు. జుగల్ బందీ తరహా కచేరీల రూపకల్పనకి ఆద్యుడు. ఆ తరహా కచేరీ మొట్ట మొదట పండిట్ భీమ్ సేన్ జోషితో కలిసి, తర్వాత పండిట్ హరిప్రసాద్ చౌరాసియా, కిషోరీ అమోన్కర్, మొదలగు వారితో కూడా జుగల్ బందీ కచేరీలు చేశారు. ఈ కచేరీలు దేశంలో ప్రజాదరణ తీసుకు రావడమే కాక, సంగీతం ద్వారా దేశ సమైక్యతను పెంపొందించ దానికి దోహద పడ్డాయి. 1957 జనవరి 12న విడుదలైన వరలక్ష్మీ పిక్చర్స్ వారి సతీ సావిత్రి సినిమా ద్వారా ఆయన గాయకులుగా, సంగీత దర్శకులుగా చిత్రరంగానికి పరిచయమైనారు. తర్వాత ఆయన గాత్ర ధర్మానికి అనువైన చిత్రాల్లో సంగీత దర్శకులు ఆయన చేత పాడించారు. 1967లో రోజా రమణి ప్రహ్లాదుడిగా, ఎస్. వి. రంగారావు హిరణ్య కశిపుడిగా నటించిన భక్త ప్రహ్లాద చిత్రంలో నారదుడిగా నటించారు. అదే సినిమాలో అతను ఆది అనాదియు నీవే దేవా, నారద సన్నుత నారాయణా, వరమొసగే వనమాలి పాటలు కూడా పాడారు. అలాగే నర్తనశాల చిత్రంలో అతను పాడిన సలలిత రాగ సుధారస సారం, శ్రీరామాంజ నేయ యుద్ధంలో మేలుకో శ్రీరామా, ముత్యాల ముగ్గు సినిమాలో శ్రీరామ జయరామ, గుప్పెడు మనసు చిత్రంలో మౌనమె నీ బాస ఓ మూగ మనసా, మేఘ సందేశం చిత్రంలో పాడనా వాణి కల్యాణిగా మొదలైన పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి. హంసగీతిలో ఆలపించిన గీతానికి 1975లో ఉత్తమ సినీ గాయకునిగా జాతీయ సినిమా పురస్కారాలు పొందారు. 1976లో ఉత్తమ నేపథ్య గాయకుడిగా మంగళంపల్లి జాతీయ అవార్డు అందుకున్నారు. కన్నడ సినిమా మధ్వాచార్యకు అందించిన సంగీతానికి గాను 1986లో ఉత్తమ సంగీత దర్శకునిగా, 1987లో ఉత్తమ సంగీత దర్శకుడిగాను జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు. 2001లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సంగీతంలో విశిష్ట పురస్కారం అందుకున్నారు. కర్నాటక సంగీత కారులలో పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అన్న 3 జాతీయ పురస్కారాలూ పొందిన ఏకైక వ్యక్తి బాలమురళీకృష్ణ. జాతీయ పురస్కారాలతో పాటు ఎన్నో విశ్వ విద్యాలయాల నంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. సినీ సంగీత దర్శకునిగా, సినీ గాయకునిగా జాతీయ అవార్డులు, సంగీత కళానిధి, గాన కౌస్తుభగాన, కళాభూషణ, గాన గంధర్వ, గాయక శిఖామణి, జ్ఞాన శిఖామణి, జ్ఞాన చక్రవర్తి, గాన పద్మం, నాథ జ్యోతి, సంగీత కళా సరస్వతి, నాథ మహర్షి, గంధర్వ గాన సామ్రాట్, జ్ఞాన సాగర తదితర లెక్కలేనన్ని బిరుదులు వరించాయి. ఆయన తన గాత్రంతోనే కాకుండా వయోలిన్, మృదంగంతోనూ ఖ్యాతి గడించారు. ఆయన అమెరికా, కెనడా, బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్స్, రష్యా, శ్రీలంక, మలేశియా, సింగపూర్, అనేక ఇతర దేశాలలో కచేరీలు చేశారు. తెలుగులోనే కాక సంస్కృతం, కన్నడం, తమిళం, హిందీ, బెంగాలీ, పంజాబీ భాషలలో కూడా పాటలు పాడారు. అనకాపల్లిలో చివరిసారిగా కచేరీ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 25వేలకు పైగా కచేరీలు ఇచ్చిన గొప్ప గాయకుడు మంగళపల్లి బాలమురళీ కృష్ణ.

# టీకాల అవిష్కరణకు ఆద్యుడు




టీకాల ఆవిష్కారానికి ఆద్యుడు లూయిా పాశ్చర్. మొదటి సారిగా రేబీస్ వ్యాధి కోసం టీకాను తయారు చేశాడు. లూయిా పాశ్చర్ తయారు చేసిన ఏంటి రేబీస్ వాక్సిన్ని మొట్టమొదటి సారిగా 1885 జూలై 6న వాడారు. ఆంత్రాక్స్, రబీస్ తదితర వ్యాధులకు మందులను కనిపెట్టడంలో మూలపురుషుడై అవిరళ కృషి సల్పిన సూక్ష్మజీవ శాస్త్రవేత్త లూయిా పాశ్చర్. 19 వ శతాబ్దంలో గాలి సోకడం వల్ల అంటువ్యాధులు వస్తాయని నమ్మేవారు. గాలిలో రోగకారక క్రిములని మోసుకొచ్చే వస్తువుల వల్ల అంటు వ్యాధులు కలుగు తాయని అప్పుడు ఎవరికీ తెలీదు. సొంత కుంటుంబంలో జరిగిన విషాద సంఘటనలు, పాశ్చర్ తన పరిశోధనలను కలరా, మశూచి వ్యాధులకు మూలమైన వ్యాధి కారకాలను కనుగొనే దిశలో కొనసాగేట్లు చేశాయి. నేడు మనం చిన్న పిల్లలకు కలరా, మశూచి, పోలియో రాకుండా ముందుగానే వేయిస్తున్న ‘టీకాలు’ ఆ మహానుభావుని ఆలోచనే. వ్యాధి వచ్చినప్పటి కంటే రాకుండా తీసుకోనే జాగ్రత్తలే మేలని ముందుగా “వ్యాక్సి నేషన్” ద్వారా వ్యాధులను రాకుండా ముందుగానే కట్టడి చేయవచ్చని సూచించాడు. అంతేకాదు వ్యాధి సోకినా దానిని నియంత్రిం చి, రూపుమాపే మందులను కూడా కనుగొనేందుకు మార్గం చూపించాడు. పాశ్చర్ తన ప్రయోగాలను ఉపయోగించి సూక్ష్మజీవులు వాస్తవానికి ఇతర సూక్ష్మజీవుల నుండి ఉత్పత్తి అవుతాయని, ఊరికే గాలిలోంచి ఊడిపడవని నిరూపించారు. నేడు లక్షలాది అంటు రోగాలను తగ్గించేందుకు మన ఆధునిక వైద్యశాస్త్ర రంగంలో మందులున్నాయి. దానికి ఎంతో కృషి సల్పిన, నేటికీ నిత్యం శ్రమిస్తున్న ఎంతో మంది సూక్ష్మ జీవశాస్త్రవేత్తలకు లూయిా పాశ్చర్ వంటి వారు ఏర్పరిచిన శాస్త్రీయ విధానమే మూలాధారం. లూయిా పాశ్చర్ (డిసెంబరు 27, 1822 %– % సెప్టెంబరు 28, 1895) ప్రముఖ ఫ్రెంచి జీవ శాస్త్రవేత్త. వ్యాధులకు కారణం సూక్ష్మక్రిములను కనుగొని రోగ నివారణకు పాశ్చర్ బాటలు వేశారు. టీకాల ఆవిష్కారానికి ఇతడు ఆద్యుడు. మొదటి సారిగా రేబీస్ వ్యాధి కోసం టీకాను తయారు చేశాడు. రాబర్ట్ కోచ్, ఫెర్డినాండ్ కాన్తో పాటు జీవశాస్త్ర వ్యవస్థాపక త్రయంలో ఒకరు. పాలు ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టే పద్ధతిని ప్రవేశ పెట్టిన వ్యక్తిగా సుపరిచితుడు. ఈ పద్ధతిని నేడు “పాశ్చరైజేషన్” అంటారు. కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. పాశ్చర్ కొన్ని అద్భుత ప్రయోగాలు చేసి సూక్ష్మ జీవులు ఒకదాన్నుండి ఒకటి పుడతాయని, గాల్లోంచి ఊడి పడవని నిరూపించాడు. ఆయన ప్రతిపాదించిన రోగకారక క్రిమి సిద్ధాంతం (+వతీవ్ ష్ట్రవశీతీఎ శీట ఎఱంఅముంవ) వైద్య శాస్త్రంలో ఒక విప్లవాత్మకమైన భావనగా చెప్పుకోవచ్చు. అంతేకాక ఆయన వ్యాధి యొక్క వ్యాప్తిని అరికట్టేందుకు ఆస్పత్రులలో చేతులు కడుక్కోవడం వంటి పరిశుభ్రతా పరమైన పద్ధతులు ప్రవేశ పెట్టాడు. పాశ్చర్ అత్యంత సునిశితమైన, క్రమబద్ధమైన ప్రయోగాలు చేసి ఎన్నో ప్రమాద కరమైన సూక్ష్మజీవులను కనుగొన్నారు. ఆ సూక్ష్మజీవులని అరికట్టే వాక్సీన్ లు రూపొందించి మనుషులనే కాక, జంతువులను కూడా ఎన్నో భయంకరమైన వ్యాధుల నుంచి కాపాడారు. పాశ్చర్ 1822 సంవత్సరం డిసెంబరు 27న ఫ్రాన్స్ లోని డోల్ గ్రామంలో జన్మించాడు. పాశ్చర్ పాఠశాలకు వెళ్ళకుండా కొంతవరకు విద్యావంతుడయ్యాడు. చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనపరిచేవాడు. తల్లిదండ్రులతో పాటు ఇరుగుపొరుగు వారివి, స్నేహితులవి బొమ్మలు పెయింట్ చేశాడు. గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలంటే ఇష్టమున్న పాశ్చర్ ఉపాధ్యాయ జీవితాన్ని గడపాలను కొనేవాడు. పదహారేళ్ల వయసులో కాలేజీ చదువు కోసం పారిస్ లో అడుగుపెట్టాడు. డాక్టరేట్ పూర్తిచేసి 1848లో స్ట్రాస్ బర్గ్ విశ్వ విద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియమితులయ్యారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కూతురు మేరీ లారెంట్ ను పెళ్ళిచేసుకోగా, అయిదుగురు పిల్లలు పుట్టినా, టైఫాయిడ్ వల్ల ఇద్దరు, మశూచి వల్ల ఒకరు, ముగ్గురు మరణించారు. పాశ్చర్ అంగారక పదార్థాలు ధ్రువిత కాంతిని ఏ విధంగా విచలనం చెందిస్తాయో అధ్యయనం చేసి “స్టీరియో కెమిస్ట్రీ” అనే కొత్త రసాయన శాస్త్రాన్ని రూపొందించారు. తరువాత తన పరిశోధనలను పులియడం (ఫెర్మెంటేషన్ ) వంటి అంశాలపై కొనసాగించి సూక్ష్మక్రిము లపై అనాదిగా ఉన్న భావాలను ఖండించి కొత్త సిద్ధాంతాలను రూపొందించాడు. ద్రాక్షసారా (వైన్) వల్ల వచ్చే వ్యాధులు, నిల్వచేసే పద్ధతులు, వెనిగర్ తయారీ మొదలైన అనేక అంశాలపై కొత్త విషయాలు కనుగొన్నాడు. రేబీస్ అనేది వైరస్ల వల్ల కలిగే ఓ భయంకరమైన వ్యాధి. అది కుక్కల నుండి మనుషులకి సోకుతుంది. ఈ వైరస్ బాక్టీరియాల కన్నా అతి చిన్నదైన వస్తువు. కనుక పాశ్చర్ వాడిన సూక్ష్మదర్శినిలో ఇది కనిపించ లేదు. ఆ వైరస్ వ్యాధితో కేంద్ర నాడీ వ్యవస్థ పై ప్రభావితం చేస్తుంది. పాశ్చర్ ఆ వ్యాధి సోకిన జంతువుల వెన్నుపాము నుండి ద్రవం సంగ్రహించి, వివిధ పద్ధతుల ద్వారా ఆ ద్రవం యొక్క రోగ తీవ్రతని క్షీణపరిచి, ఆ ద్రవాన్ని తిరిగి కుక్కల మీదకి ఎక్కించి రేబీస్ కి వాక్సీన్ ని రూపొందించారు. కోళ్లకు వచ్చే కలరా వంటి పారుడు వ్యాధిపై పరిశోధన జరిపి వ్యాధి కారకాలైన సూక్ష్మజీవులను బలహీనపరచి ఇతర కోళ్ళకు ఎక్కించి వాటిలో రోగనిరోధక శక్తి పెరిగి తర్వాత కాలంలో రోగం రాకుండా రక్షిస్తుందని నిర్ణయానికి వచ్చారు. 1870 దశాబ్దంలో టీకా పద్ధతులను పశువులలో వచ్చే ఆంత్రాక్స్ వ్యాధి మీద ప్రయోగించాడు. ఈ విధంగా కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. అందువలన మనిషులు గాని, జంతువులు గాని అంటు వ్యాధితో మరణిస్తే ఆ శవాన్ని దహనం చేయాలని చెప్పారు. భూమిలో పాతిపెడితే శరీరంలోని క్రిములు బయటకు వచ్చి వాటివలన ఇతరులకు ఆ వ్యాధులు వ్యాపిస్తాయని వివరించాడు. పాశ్చర్ తన పూర్తి జీవితాన్ని శాస్త్ర పరిశోధనలకు అంకితం చేశారు. సంకల్ప బలం, నిరంతర శ్రమతో విజయాన్ని సాధించవచ్చని పాశ్చర్ విశ్వాసం. పాశ్చర్ సూక్ష్మ జీవశాస్త్రంలో అత్యుత్తమ గౌరవమని పిలిచే లీవెన్ హాక్ బహుమతిని 1895లో పొందాడు. రెండు సార్లు గుండె పోటు, తరువాత పక్షవాతం వచ్చినా జీవితాంతం పరిశోధన చేసి మానవాళికి వెలకట్టలేని సేవ చేసిన పాశ్చర్ 1895 సెప్టెంబరు 28న పరమ పదించారు. లూయిస్ పాశ్చర్ జ్ఞాపకర్ధంగా ఆయన మరణించిన రోజైన సెప్టెంబరు 28న ప్రపంచ రేబీస్ దినోత్సవం జరుపుకుంటారు.

## విద్యార్థి చదువుకు ఆర్థిక సహాయం




**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** పెద్దపల్లి పట్టణంలోని స్థానిక ట్రినిటీ సీబీఎస్ఈ పాఠశాలలో 9 వ తరగతి విద్యను అభ్యసిస్తున్న పులి అభిరామ్, స్కూలు ఫీజును యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ – పెద్దపల్లి జిల్లా ద్వారా డాక్టర్ మందల గోకుల్ రెడ్డి, హైదరాబాద్ లక్ష ఇరవై వేల రూపాయల ఆర్థిక సహాయం చెక్కు రూపంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మందల గోకుల్ రెడ్డికి ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో యాదవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మారం తిరుపతి యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు, ట్రస్ట్ కోశాధికారి మేకల మల్లేశం యాదవ్, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలారపు పర్వతాలు యాదవ్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెత్తుల నాగరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మొదటి త్రైమాసికంలో నూరు శాతం బొగ్గు రవాణా సాధించిన సింగరేణి

**సీఎండీ ఎన్. బలరామ్ హర్షం**

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూలై 5** జులై లో రోజుకు 1.8 లక్షల టన్నుల ఉత్పత్తి, 2.15 లక్షల టన్నుల రవాణా సాధించాలి ఈ నెలలో కొత్తగూడెం వీకే ఓపెన్ కాస్ట్ కు భూమి పూజ వర్షాకాలపు జాగ్రత్తలతో ఓసీ గనుల నుండి నిరాటంకంగా బొగ్గు ఉత్పత్తి సాగించాలి భూగర్భ గనులలో.. ఉత్పత్తిని గణనీయంగా పెంచాలి ఏరియా జీఎంలకు సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశం సింగరేణి భవన్, జులై 05 , 2025 సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బొగ్గు రవాణాలో 100 శాతం, బొగ్గు ఉత్పత్తిలో 99 శాతం లక్ష్యాలను సాధించడం పై సీఎండీ ఎన్.బలరామ్ తన హర్షం ప్రకటించారు. ఏప్రిల్ నుండి జూన్ నెల వరకు బొగ్గు రవాణా లక్ష్యం 160 లక్షల టన్నులు కాగా, 103 శాతం తో కంపెనీ 166 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసింది. అలాగే బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 160 లక్షల టన్నులు కాగా,99 శాతం తో కంపెనీ 159.9 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి సాధించింది. శనివారం హైదరాబాద్ లోని సింగరేణి భవన్ నుంచి సంస్థ సీఎండీ శ్రీ.ఎన్.బలరామ్ సంస్థ డైరెక్టర్లతో,అన్ని ఏరియాల్లోని జీఎంలతో త్రైమాసిక ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్షాకాలంలో కూడా ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి కుంటు పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జులై నెలకు నిర్దేశించిన లక్ష్యాలు సాధించడం కోసం రోజుకు 2.15 లక్షల టన్నుల బొగ్గు రవాణా,1.80 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన ప్రతీ ఏరియా ప్రగతిపై సంబంధిత ఏరియా జీఎంతో సమీక్షించారు. ఉత్పత్తికి అవరోధంగా ఉన్న అంశాల పైన ఆయన అప్పటి కప్పుడే ఆదేశాలు జారీ చేశారు. కాగా కొత్తగూడెంలో అన్ని అనుమతులు మంజూరైన వీకే ఓపెన్ కాస్ట్ గని భూమి పూజ కార్యక్రమాన్ని ఈ నెలాఖరులో నిర్వహించాలని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఇల్లందు జేకే కోల్ మైన్, గోలేటి కోల్ మైన్ కు సంబంధించిన పర్యావరణ,అటవీ శాఖ అనుమతులకు సంబంధించి ప్రయత్నాలు మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన బొగ్గు నాణ్యతా ప్రమాణాల పెంపుదలకు తీసుకుంటున్న చర్యలపై నిశితంగా చర్చించారు. వినియోగదారులకు ఇస్తామన్న గ్రేడ్ బొగ్గును సరఫరా చేయడానికి ప్రతీ ఏరియాలో సిహెచ్ పి లలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. అలాగే రక్షణకు సంబంధించి ప్రతీ గనిలో రక్షణ ఆడిట్లను నిర్వహించాలని రక్షణ లోపాలు లేకుండా సవరించాలని ఆయన సేఫ్టీ విభాగం వారిని ఆదేశించారు.ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్ లో ప్రారంభమైన బొగ్గు ఉత్పత్తి పై కూడా ఆయన సమీక్షించారు. అక్కడ ఉత్పత్తి అవుతున్న బొగ్గును సమీపంలోని చండిపడా రైల్వే సైడింగ్ కు రవాణా చేయడానికి తగు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎం), ఎల్.వి సూర్యనారాయణ(ఆపరేషన్స్ ),కె. వెంకటేశ్వర్లు(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ ) గౌతమ్ పొట్రు(పా), ఈడీ (కోల్ మూమెంట్) శ్రీ ఎస్.డి.ఎం సుభాని, అడ్వైజర్ (ఫారెస్ట్రీ) మోహన్ పరిగెన్, జీఎం (సి పి పి) ఏ.మనోహర్, కార్పోరేట్ జీఎంలు, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

**వనపర్తి** : జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయం వెనక ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదాము ను నెలవారీ తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ,ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శనివారం నెలవారి తనిఖీ లు చేసినట్లు వివిధ రాజకీయ వివరించారు. తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మహిళా సంఘాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుంది

**హైదరాబాద్** : తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని తెలంగాణా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. అవకాశం ఉన్న ప్రతిచోటా మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామని అన్నారు. ప్రజాభవన్ లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఆర్టిసికి అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. వ్యాపారం చేసుకునే మహిళలను ప్రోత్సహి స్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ముందుకెళు తున్నామని తెలియజేశారు.ఐదేళ్లలో మహిళలకు రూ. లక్ష రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమని, మహిళలకు తమ ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ది గురించి చర్చించాలని అన్నారు. గ్రామాలు, మండలాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెల 10 నుంచి 16 వరకు అసెంబ్లీ నియోజక వర్గాల్లో సమావేశాలు జరగనున్నాయని చెప్పారు. వడ్డి లేని రుణాల నగదును చెక్కుల రూపంలో అందిస్తామని, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపై ప్రజలకు వివరించాలి అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వేగంగా గ్రౌండింగ్ ప్రారంభించాలి

**వనపర్తి** : ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రెండవ దశలో పథకానికి ఎంపికై మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వేగంగా గ్రౌండింగ్ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం కలెక్టర్ తన ఛాంబర్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతికి సంబంధించి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల యాదయ్య తో కలిసి హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంళ్లకు సంబంధించి రెండవ దశలో పథకానికి ఎంపికై మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు వేగంగా గ్రౌండింగ్ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇంటిని ఎంత త్వరగా పూర్తి చేస్తే అంతే త్వరగా బిల్లులు రావడం జరుగుతుందని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

## మండల కమిటీని ప్రకటించిన రమేష్

## బిజెపి పార్టీ పెద్దపల్లి మండల ఉపాధ్యక్షులుగా సబ్బు మల్లయ్య.





శనివారం పెద్దపల్లి రూరల్ మండల అధ్యక్షులు వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో.. మండలంలోని ప్రతి గ్రామంలో బూత్ స్థాయిలో బిజెపి పార్టీని సంస్థగతంగా బలపరచడానికి రాష్ట్ర పార్టీ సూచన మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,పెద్దపల్లి అసెంబ్లీ ఇన్చార్జి దుగ్యాల ప్రదీప్ కుమార్ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ఆదేశాల మేరకు పెద్దపల్లి రూరల్ మండల కమిటీ నియమించడం జరిగినది అన్నారు. పెద్దపల్లి మండలం ఉపాధ్యక్షులుగా సబ్బు మల్లయ్య, మేడగోని సదయ్య,శిరిశెట్టి కృష్ణ మోహన్, నాంసాని రాజయ్య, ప్రధాన కార్యదర్శులుగా పడాల శ్రీధర్, మామిడి ఉమేష్ , కార్యదర్శులుగా ఇల్లందుల అంజి బాబు ,రెడ్డి శ్రీకాంత్ ,శిలారపు మహేష్, బానావత్ సరిత , కోశాధికారిగా భూషణవేణి ఉపేందర్ లను నియమించడం జరిగినది అన్నారు. వీరితో పాటు 35 మందిని మండల కార్యవర్గ సభ్యులుగా నియమించడం జరిగినది అన్నారు.వీరి నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని రమేష్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో 11 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రతి గ్రామ గ్రామాన తెలియజేస్తూ మోడీ తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా పని చేస్తూ , రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వార్డు ఎన్నికలలో గ్రామపంచాయతీ ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలలో అధికారం వచ్చేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని, అలాగే రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా పని చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా నియామకమైన పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సబ్బు మల్లయ్య మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి తన తల్లి నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు

## సిపిఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. ఆంజనేయులు అధ్యక్షతన కల్వకుర్తి పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ విస్తృత సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు పాల్గొని ప్రసంగించారు ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ విధానాలను తిరస్కరిస్తూ ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్స్ అన్ని ఏకమై జులై 9న సార్వత్రిక సమ్మె నిర్వహించబోతున్నాయని గత మే 20వ తేదీన నిర్వహించాల్సినటువంటి సమ్మె భారత్ పాకిస్తాన్ రెండుపొరుగు దేశాల మధ్య వైమానిక దాడుల్లో ఉద్రిక్తతలు పెరగడంతో జులై 9కి వాయిదా వేశాయని ముఖ్యంగా బిజెపి ప్రభుత్వం 2019 -20 లో లేబర్ కోడులను పార్లమెంటులో ఆమోదింప చేసుకున్నదని కానీ కార్మిక వర్గం నుండి బలమైన ప్రతిఘటన ఎదురైన కారణంగా కోడ్ అమలు చేయలేదన్నారు. కేంద్ర బీజేపీ తీసుకొచ్చిన కోడ్స్ అమలయితే సామాజిక భద్రత, ఉమ్మడి బేరసారాల హక్కు, సంఘం పెట్టుకునే హక్కులు కఠిన తరంగా మారుతాయి అని గతంలో ఉన్న సంక్షేమ పథకాలు తగ్గించి ఇచ్చే ఆర్థిక సహాయం కూడా తగ్గిస్తారని అన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక బడా వ్యాపార సంస్థల అనుకూల విధానాలతో పాలన సాగిస్తోందని మతోన్మాదం ప్రాంతీయ విభేదాలను ప్రోత్సహిస్తున్నదని 2025 కేంద్ర బడ్జెట్ లో కూడా విద్యా వైద్యం ఉపాధి హామీ లాంటి సంఘం సామాజిక సంక్షేమలకు నిధులు తగ్గించిందని అన్నారు. నిత్యవసర వస్తువులపై అధిక పనులు విధిస్తూ పేదలపై పెను బారాలు మోపిందని బడా బాబులకు కార్పొరేట్లకు లక్షల కోట్ల రాయితీలు ఇచ్చి ప్రజల మౌలిక ఆస్తులైన రైల్వే, రోడ్లు, రక్షణ,విమానాశ్రయాలు ,టెలికాం, తదితర రంగాలను ప్రభుత్వ ఆస్తుల్ని ప్రైవేటు వారికి ఇచ్చి సొమ్ము చేసుకోవడం నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ పేరుతో కార్పొరేట్లకు దోచిపెడుతుందని అన్నారు. లక్షరాది ఎకరాలు రైతుల భూములను బడా బాబులకు కారు చౌకగా కట్టబెడుతుందని ప్రజలు ఇలాంటి విధానాలను ముక్తకంఠంగా వ్యతిరేకించాలని అన్నారు.జరిగే సార్వత్రిక సమ్మెలో సిఐటియు అనుబంధ సంఘాలు అయినటువంటి అంగన్వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్, విఓఏ లాంటి స్కీమ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ మరియు కాంట్రాక్టు సంఘటిత అసంఘటిత రంగ కార్మికులు మున్సిపల్ గ్రామపంచాయతీ కార్మికులు భవన నిర్మాణం రోడ్డు ట్రాన్స్పోర్ట్ హమాలీ లాంటి మొత్తం కార్మికులు ఆ సమ్మెలో పాల్గొనబోతున్నారని సిఐటియు మాత్రమే కాకుండ ఒక బిఎం ఎస్ తప్ప దేశంలోని అన్ని కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్లు పాల్గొంటున్నయని ఆ సమ్మెకు సిపిఎం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సిపిఎం పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఏపీ. మల్లయ్య పార్టీ నాయకులు జి.గున్నమ్మ పరమేష్ ,బక్కయ్య హుస్సేన్ ,రేనయ్య, మల్లారెడ్డి ,చెన్నయ్య మరియు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు రామరాజు, బి. శ్రీనివాసులు ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ జగన్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాఘవేందర్ రెడ్డి సేవలు అభినందనీయం

**ప్రారంభమైన ఐక్యత ఫౌండేషన్ ఉచిత కంటి వైద్య శిభిరం సేవలు**

**800 మందికి పైగా హాజరు ,600 మందికి కంటి పరీక్షలు, 35 మంది శుక్లాల సర్జరీకి ఎంపిక**

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి,జడ్జి శ్రీదేవి,డాక్టర్ దామోదర్ రెడ్డి**





**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని సి కె ఆర్ ఫంక్షన్ హాల్లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ఐక్యత ఫౌండేషన్ం శంకర నేత్రాలయ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిభిరం సేవలు స్థానిక ప్రముఖ డా.దామోదర్ రెడ్డి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా,సీనియర్ జడ్జి శ్రీమతి శ్రీదేవి శిబిరాన్ని సందర్శించి ఉచిత కంటి వైద్య శిభిరం సేవలను పరిశీలించి, అద్దాల పంపిణి,కంటి సర్జరీలకు సంబంధించిన పలు విషయాలు వైద్యుల బృందంతో చర్చించి వారిని అభినం దించడం జరిగింది.ఈ సందర్భంగా సీనియర్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సేవలు అభినందనీ యం అని,గత కొన్ని నెలలుగా నేను ఎక్కడ చూసినా ఐక్యత పౌండేషన్ ద్వారా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సామాజిక సేవలు గమనిస్తు న్నానని,వాటికి సంబంధించిన పలు గురించి కూడా నేను తెలుసు కున్నానని, వారికి సమాజం పట్ల,ప్రజలకు ఏదో చెయ్యాలనే సేవా దృక్పథానికి అభినందిస్తున్నానని, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి లాగే ప్రతి ఒక్కరు సమాజం పట్ల ఎంతో కొంత సేవ దృక్పథాన్ని అలవర్చుకోవాలని,పేదలకు ఉచిత కంటి సర్జరీలు,అద్దాల పంపిణి వంటి వ్యయంతో కూడుకున్న సేవలను పేద ప్రజలకి అందిస్తున్నందుకు వారిని ఈ సందర్భంగా అభినందనలు తెలియజేస్తు, ఒక గొప్ప కార్యక్రమానికి ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. డా.దామోదర్ రెడ్డి మాట్లాడుతూ. కల్వకుర్తి ప్రాంతంలో ఇంత గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పేదలకు ఉచితంగా సర్జరీలు చేసి,వారికి అన్ని విధాలుగా అండగా ఉంటున్నారని వారి గొప్ప సేవలు కల్వకుర్తి ప్రజలకు అందిస్తున్నందుకు ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి అభినందనలు తెలియజేస్తు, గొప్ప కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలు తమ తమ ఆర్థిక ఇబ్బందులు,పలు కారణాల వలన కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని, నియోజక వర్గంలో కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న ప్రతి పేదవాడికి తన వంతు ప్రయత్నంగా అండగా ఉండటానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టానని,మా కార్యక్రమం ప్రారంభోత్సవానికి విచ్చేసి,తమ విలువైన సమయాన్ని కేటాయించి,పలు సూచనలు అందించిన సీనియర్ జడ్జి శ్రీమతి శ్రీదేవి మేడమ్ కి స్థానిక సీనియర్ డా.దామోదర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పవన్ కుమార్ రెడ్డి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీస బాలరాజు,యువజన నాయకులు పర్యపాకుల రమేష్,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి గుంతలుగా మారిన రోడ్డుకు మట్టితో పూడ్చి వేత

మాజీ సర్పంచ్ శ్రీశైలం



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి, మండలం దేవుని పడకల్ గ్రామంలోని పొలాలు ,మరియు వైకుంతదామనికి వెళ్ళే మట్టి రోడ్ ఇటీవల కురిసిన వర్షాలకు బురద పూర్తిగా గుంతలుగ మారడంతో రైతుల రాకపోకలకు ఇబ్బంది బురద రోడ్ లో రాకపోకలకు ఇబ్బంది కలగడంతో రైతులు గ్రామ మాజీ సర్పంచ్ శ్రీశైలం దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం తన సొంత డబ్బులతో 26 ,500 రూపాయలు ఖర్చు చేసి రోడ్ పై మట్టి పోయించి చదును చేయించడం జరిగింది. వెంటనే స్పందించి మట్టి రోడుకు మరమ్మతులు చేయించిన మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, అంబటి బిక్షపతి, రాజమోని శంకర్, కృష్ణ,స్వామి,వేణు,శ్రీను, కార్తీక్. తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు కృష్ణ రెడ్డి జన్మ దిన వేడుకలు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ రైతు సమన్వయ సమితి గ్రామ కమిటీ అధ్యక్షుడు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తలసాని కృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు గ్రామ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కటింగ్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల ట్రస్టు ద్వారా నిరుపేద కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత

ట్రస్టు ఛైర్మెన్ మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** తలకొండపల్లి మండలం లోనీ చుక్కాపూర్ గ్రామ పరిధిలోని గ్రామానికి ఎడవెల్లి గ్రామనికి చెందిన గుడెటి కృష్ణయ్య జంగయ్య నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో వారు నిర్మించుకుంటున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణంలో భాగంగా ఇంటి నిర్మాణం కోసం సిమెంటు బస్తాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబం సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి బి ఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మల్లేష్. ఆర్ మల్లేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లి సాగుపై రైతులకు అవగాహన



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** సంగారెడ్డి జిల్లా మనూర్ మండలం పరిధిలో రానాపూర్ తుమ్మూనురు ఉల్లి సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సమీకృత అభివృద్ధి మిషన్ పథకం ద్వారా ఉల్లి సాగు ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందించనున్నారు. ఇందుకుగాను రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి కే మౌనిక రెడ్డి రైతులకు సూచించారు. ఉల్లి సాగు కొరకు ఎకరానికి 8000 సబ్సిడీ అందించనున్నారు. అదేవిధంగా పండ్ల తోటల నిర్వహణకు గాను, కూరగాయల సాగుకు వివిధ రకాల రాయితీ వివరాలను ఉద్యాన శాఖ వారు తెలియజేసినారు. ఆయిల్ ఫామ్ పంట వేసుకొని దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ పంట కొనుగోలు చేస్తుందని రైతులకు వివరించారు. ఎకరానికి రూపాయలు 50,918 రాయితీ రూపంలో ఆయిల్ పామ్ పంటకు అందించునున్నది రైతులకు వివరంగా తెలియజేశారు. పంట మార్పిడి లో భాగంగా ఉద్యాన పంటలను సాగు చేసుకోవాలని ఏడిఏ నారాయణఖేడ్ డివిజన్ నూతన కుమార్ రైతులకు సూచించారు, ఈ కార్యక్రమానికి ఏడిఏ నారాయణఖేడ్ నూతన కుమార్, ఉద్యాన అధికారి కే మౌనిక రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మహేష్, ఏఈఓ సంధ్య, బ్రహ్మానందరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, గొల్ల బాషన్న, మున్నూరు లక్ష్మన్న,రాణాపూర్ సుభాష్ రావు, పండరీనాథ్ రావు, రాజు మాజీ సర్పంచ్ దూదగొండ ,రైతులు పాల్గొన్నారు.

## కె.సి.ఆర్ ని మర్యాదపూర్వకంగా కలసిన మాజీ మంత్రినిరంజన్ రెడ్డి,నేతలు



**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి,ఎం.ఎల్.సి నవీన్ రెడ్డి,మాజీ ఎం.ఎల్.ఏలు రావుల.చంద్రశేఖర్ రెడ్డి,జైపాల్ యాదవ్,గువ్వల.బాలరాజు శనివారం నందినగర్ నివాసంలోమర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా వారు కె.సి.ఆర్ ఆరోగ్య,యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొద్దిసేపు భేటీ అయిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బృందంతో కె.సి.ఆర్ పార్టీ నిర్మాణం,రాష్ట వ్యాప్తంగా ప్రజల సమస్యలు,జిల్లాలో పార్టీ బలోపేతం గురించి చర్చించి పలు సూచనలు చేశారు. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సాధకులు తెలంగాణ అభివృద్ధి ప్రదాత మాకు మార్గదర్శకులు కె.సి.ఆర్ అని వారి నాయకత్వం మాకు ప్రజలకు శ్రీరామరక్ష అని కొనియాడారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్శ్ సురభి.



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా:** జిల్లా కేంద్రంలోని ఈవీఎంలు భద్రపరిచిన గోదాము కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయం వెనక ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదాము ను నెలవారీ తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శనివారం నెలవారి తనిఖీ లు చేసినట్లు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులకు వివరించారు. తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మాకు క్యాడర్ స్కీం అమలు చేయండి

**ఏసీఎంవో,జిఎంలకు పారామెడికల్ సిబ్బంది వినతి**



**అగ్నిధార న్యూస్,( రామగుండం) :** సింగరేణిలో పనిచేస్తున్న తమకు క్యాడర్ స్కీమ్ అమలు చేయాలని సింగరేణి పారామెడికల్ సిబ్బంది విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు శనివారం గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ఏసీఎంవో డాక్టర్ అంబిక కు పారామెడికల్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు.వార్డ్ అసిస్టెంట్ లకు గ్రేడ్ హెచ్ ఇవ్వడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని,కోల్ ఇండియాలో అదే డెసిగ్నేషన్ కి గ్రేడ్ ఈ ఇస్తున్నారని ఏసీఎంవో దృష్టికి తీసుకెళ్లారు.సింగరేణిలో గ్రేడ్ ఈ చేరుకోవడానికి దాదాపు 20 సంవత్సరాల సమయం పడుతుందని చెప్పారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఏసీఎంవో డాక్టర్ అంబిక ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తానని వార్డు అసిస్టెంట్స్ కు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సిబ్బంది దాసరి అనిల్,సంతోష్,భాస్కర్ పాల్గొన్నారు.

## ధూప,దీప,నైవేద్య అర్చక సంఘం అధ్యక్షులుగా శ్రావణ్ కుమార్



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** ధూప,దీప,నైవేద్య అర్చక సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా గోదావరిఖనికే చెందిన ఏటూరి శ్రావణ్ కుమార్ ఆచార్యులు నియామితుల య్యారు.శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో జరిగిన తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేరంబుదూరు శ్రీకాంత్ ఆచార్యులు ప్రకటించారు.రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నిట్టూరి సతీష్ శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కాండూరి దామోదరచార్యులు నియామక పత్రాలను శ్రావణ్ కుమార్ కు అందజేశారు. రామగుండం మండల అధ్యక్షులు రుద్రపట్ల సత్యనారాయణ శర్మ,ఉమ్మడి కరీంనగర్ జిల్లా మండలాల అధ్యక్షులు ఏటూరి శ్రావణ్ కుమార్ కు అభినందనలు తెలిపారు.

## పట్టణంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్..

**ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో..స్పెషల్ డ్రైవ్**

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం, జూలై 5** మందమర్రి పట్టణంలో సి ఇ ఆర్ క్లబ్ ప్రాంతం సమీపంలో..ఎస్ఐ రాజశేఖర్,అదనపు ఎస్ఐ శ్రీనివాస్ మరియు వారి సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా..డ్రంక్ అండ్ డ్రైవ్,వాహనంలకు సరైన పత్రములు లేని వాటికి ఫైన్ వేయడం జరిగినది.ఎస్సై రాజశేఖర్ వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలి మరియు మద్యం సేవించకూడదు,బండి పేపర్లు అన్ని జిరాక్స్ తీసుకొని వాహనాలలో జాగ్రత్త పరచుకొ వాలి.డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా వాహనం నడిపి,గమ్యాన్ని చేరాలని ఎస్.ఐ సూచనలు ఇవ్వడం జరిగింది.తన సిబ్బంది బ్లూ కోర్ట్ విశ్వనాధ్,రాజేందర్ హెడ్ కానిస్టేబుల్,మోయిన్ హెూంగార్లు,శ్రావణ్. ఉన్నారు

## గ్రామాల్లో మొహరం చిన్న సరిగతి వేడుకలు.

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** మొహరం నెల సందర్భంగా శనివారం చిన్న సరిగతి వేడుకలు కమాన్ మండలంలో జరిగాయి.గత వారం రోజులుగా వివిధ గ్రామాల్లో పీరీలను ఆశిర్ ఖానాల్లో ప్రదేశింపజేశారు. శనివారం 8వ రోజు చిన్న సరిగమతి సందర్భంగా గ్రామాల్లో ఊరేగించారు. ఈ వేడుకలు కమాన్ పూర్, గుండారం, జూలపల్లి ,రొంపిగుంట ,పేరాపల్లి, పెంచికలపేట్, తదితర గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. కాగా ఆదివారం తమ తమ ఇండ్లలో బెల్లం పానకం తయారు చేసి ఆయా గ్రామాల్లోని మసీదుల వద్ద పీడీలకు సమర్పిస్తారు. సోమవారం పెద్ద సరగతి వేడుకలతో గ్రామాల్లో మొహరం వేడుకలు ముగియనున్నాయి. గత వారం రోజులుగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో భక్తులు కుల మతాలకతీతంగా పాల్గొన్నారు.

## ఆర్. జీ. యూ. కే. టీ కి ఎంపికైన జూలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు..!

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** తెలంగాణలోని బాసర, మహబూబ్ నగర్ లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీస్ లలో ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ (ఇంటర్ మరియు ఇంజనీరింగ్)కోర్సులలో ప్రవేశానికి పదవ తరగతి మార్కుల ఆధారంగా జరిగిన ప్రవేశ ప్రక్రియలో జూలపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు వైద్య శ్రీవరుణ్, పెనగొండ హార్దిక్ ఎంపిక య్యారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత ఉపాధ్యాయులు నాగరాజు, గంగారాం, శ్రీనివాస్, శిరోమణి శ్రీదేవి, శ్రీలక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప, వివో ప్రేమలత అభినందనలు తెలియజేశారు. తల్లిదండ్రులు వారి ఆనందాన్ని పంచుకున్నారు. జూలపల్లి పాఠశాల ప్రతీ సంవత్సరం దిన దినాభివృద్ధి చెందుతూ జిల్లా స్థాయిలో అద్భుత విజయాలు సాధిస్తుందని మెచ్చుకొంటూ గ్రామ కార్యదర్శి అంబటి శంకర్, మాజీ సర్పంచ్ బొల్లంపల్లి శంకర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పోల్దాసరి సాయి కుమార్, మాజీ ఎంపిటీసీలు శెవ్వ శంకరయ్య, వినోద, లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ అధ్యక్షులు సాన రామకృష్ణా రెడ్డి లు విద్యార్థులను ఆశీర్వదించి అభినందించారు. ఎంపికైన పిల్లలు ఆరు సంవత్సరాలలో పైసా ఖర్చు లేకుండా ఇంటర్ మరియు ఇంజనీరింగ్ పూర్తి చేయనున్నారు.

## ఆర్. జీ. యూ. కే. టీ కి ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు..!


**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్** తెలంగాణ లోని బాసర, మహబూబ్ నగర్ లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీస్ (లలో ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ (ఇంటర్ ఇంజనీరింగ్) కోర్సులలో ప్రవేశానికి పదవ తరగతి మార్కుల ఆధారంగా జరిగిన ప్రవేశ ప్రక్రియలో జూలపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు వైద్య శ్రీవరుణ్, పెనగొండ హార్దిక్ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత ఉపాధ్యాయులు నాగరాజు, గంగారాం, శ్రీనివాస్, శిరోమణి,శ్రీదేవి, శ్రీలక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప, వివో ప్రేమలత అభినందనలు తెలియజేశారు.తల్లిదండ్రులు వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అంబటి శంకర్, మాజీ సర్పంచ్ బొల్లంపల్లి శంకర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పోల్దాసరి సాయి కుమార్, మాజీ ఎంపిటీసీలు శెవ్వ శంకరయ్య, వినోద, లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ అధ్యక్షులు సాన రామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమరభేరి సభతో ఫుల్ జోష్

**సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికిఅందించాలి.**

**దేశానికే ఆదర్శం రైతు భరోసా.**

**ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి.**



**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :** సామాజిక న్యాయ సమరభేరి సభతో కాంగ్రెస్ కార్యకర్తలు నేతల్లో ఫుల్ జోష్ నింపిందని, హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక న్యాయ సమరభరి సభతో కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి శనివారం ఒక ప్రకటన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రస్తుతం తెలంగాణలో 119 ఎమ్మెల్యే స్థానాలు ఉన్నాయని అవి నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 153 కాబోతున్నాయని కాంగ్రెస్ పార్టీకి కష్టపడి పనిచేసే కార్యకర్తలకు రాబోయే కాలంలో మంచి రోజులు ఉంటాయని నామినేటెడ్ పదవుల బర్తీ వెంటనే చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇప్పటికే రాష్ట్ర అధినాయకత్వానికి సూచించడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను పెంచే విధంగా పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులకు ఎంపిక చేయనుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాలో కేవలం 9 రోజుల్లో 9000 కోట్ల రూపాయలను రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతల ఖాతాలో జమ చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ గొప్ప విజయాన్ని రైతులకు ప్రజలకు కార్యకర్తలు వివరించాలని సూచించారు.అలాగే ఇందిరమ్మ ఇండ్లు. ఉచిత విద్యుత్తు. ఆర్టీసీ బస్సు ప్రయాణం. ఆరోగ్య శ్రీ పెంపు. నూతన రేషన్ కార్డుల మంజూరు. పాత రేషన్ కార్డులలో సభ్యుల చేరికలు. వంటి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే మేఘా రెడ్డి తెలిపారు.. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి పథకాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని సీఎం సహాయ నిధి వల్ల పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు రూ : 500 బోనస్ వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. వరి ధాన్యం సేకరించిన వెంటనే రైతుల ఖాతాలో నగదు జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కార్యకర్తలతో కలిసి సామాజిక న్యాయ సభకు వెళ్లడం ఎంతో సంతోషాన్నిచ్చిందని కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా తాను ముందుండి పనిచేస్తానని నియోజకవర్గ ప్రజలకు ఇంటి పెద్ద కొడుకుగా.. అన్నగా.. తమ్ముడిగా.. పనిచేసే పెడతానని ఆయన అన్నారు..

## మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేత

**ట్రస్టు ఛైర్మెన్ ఉప్పల వెంకటేష్**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)** చారగొండ మండలం లోని గోకారం గ్రామంలో కామోజీ రాములు అనారోగ్యంతో మరణించడం జరిగింది. స్థానిక బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సిద్ధగోని రమేష్ గౌడ్ ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి సాను భూతి తెలుపుతూ ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు నాయకులు, గ్రామ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేర ప్రవృత్తిని వీడండి లేదంటే కఠిన చర్యలు తప్పవు..

**బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ రౌడీషీటర్లకు తీవ్ర హెచ్చరిక**

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూలై 5** మందమర్రి సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లు తమ నేర ప్రవృత్తిని తక్షణమే విడనాడి, సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని, లేనిపక్షంలో అత్యంత కఠినమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని బెల్లంపల్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రవికుమార్ తీవ్రంగా హెచ్చరించారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా (ఐపీఎస్) మరియు మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ (ఐపీఎస్)ఆదేశాల మేరకు,శనివారం రోజున మందమర్రి సర్కిల్ కార్యాలయంలో.. రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... “గతంలో మీరు చేసిన నేరాలను పక్కనపెట్టి, మంచిగా బ్రతకడానికి ఇదొక అవకాశం.మీ ప్రవర్తనలో మార్పు రాకపోతే,పోలీసు శాఖ కఠినంగా వ్యవహరించాల్సి వస్తుంది.ప్రతి రౌడీషీటర్ యొక్క కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా..ఉపేక్షించే ప్రసక్తే లేదు,”అని స్పష్టం చేశారు.నేరాల వల్ల కేవలం నేరస్తులే కాకుండా, వారి కుటుంబ సభ్యులు,ముఖ్యంగా పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.”డాక్టర్ల పిల్లలు డాక్టర్లు, పోలీసుల పిల్లలు పోలీసులు అవుతున్నారు.మీ పిల్లలు కూడా మిమ్మల్ని అనుసరిస్తే వారూ నేరస్తులుగానే మారే ప్రమాదం ఉంది. మీ పిల్లల భవిష్యత్తును నాశనం చేయకండి,”అని హితవు పలికారు.అయితే,పూర్తిగా మారి, మంచి నడవడికతో జీవించే వారికి పోలీసు శాఖ అండగా ఉంటుందని ఏసీపీ భరోసా ఇచ్చారు.”మీరు చేసే మంచి పనులను కూడా ఇకపై మీ రికార్డులలో నమోదు చేస్తాం.మీలో సంపూర్ణమైన మార్పు వస్తే, ఉన్నతాధికారుల సూచనల మేరకు మీపై ఉన్న రౌడీ షీట్‌ను తొలగించే విషయాన్ని కూడా పరిశీలిస్తాం.గతాన్ని మరిచి,కొత్త జీవితాన్ని ప్రారంభించండి,”అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో.. మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి, మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


## జులై 9వ తేదీన తలపెట్టిన ఒక్కరోజు సమ్మెకు దూరంగా ఉండాలి..

**మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి.దేవేందర్**

**అగ్ని ధార న్యూస్, మందమర్రి మండలం జూలై 5** ప్రతి ఒక్క ఉద్యోగి విధులకు హాజరుకావాలని లక్ష్యసాధనలో సహకరించాలని అన్నారు. కొన్ని కార్మిక సంఘాలు వివిధ డిమాండ్లతో జులై 9వ తేదీన ఒకరోజు సమ్మెకు పిలుపునిస్తూ, సింగరేణి కార్మికులు కూడా దీనిలో పాల్గొనాలని పిలుపునిచ్చాయి. కానీ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఈ సమ్మె డిమాండ్లలో అత్యధికం సింగరేణి కార్మికులకు సంబంధించినవి కావు, సింగరేణి యాజమాన్యం తీర్చగలిగినవి కూడా కావు,సింగరేణి సంస్థ పరిధిలోని సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించు కునే అవకాశం కలదు. అటువంటప్పుడు మన కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనవలసిన అవసరం ఉందా? ఆలోచించండి.! వివిధ కారణాల వలన ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి మరియు ఓవర్ బర్డెన్ తొలగింపులో కొంత వెనుకబడి ఉన్నాము. ఈ జులై,ఆగష్టు నెలల్లో వర్షాల ప్రభావం వల్ల ఓపెన్ కాస్ట్ మైన్లలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలుగుతుందన్న విషయం మీకు తెలిసిందే.ఈ సమయంలో లక్ష్యసాధనకు ప్రతీ రోజు సాధించే ఉత్పత్తి కూడా ఎంతో తోడ్పాటునందిస్తుంది. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరగడానికి మనం నిర్దేశించిన ఉత్పత్తి సాధిస్తూ.. సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒక్కరోజు సమ్మె చేస్తే..కంపెనీకి కలిగే ఉత్పత్తి నష్టం విలువ సుమారు రూ.76 కోట్లు కార్మికులు కోల్పోయే వేతనాలు,సుమారు రూ.13.07 కోట్లు ఒక్క రోజు ఉత్పత్తి నష్టం,1.92 లక్షల టన్నులు గత ఆర్థిక సంవత్సరం 2024-23లో 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి,65.27 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా జరిగినది.లాభాల బోనస్,పిఎల్అర్ బోనస్లు ఉద్యోగులకు చెల్లించడం జరుగుతున్నది.వివిధ సంక్షేమ పథకాలను కూడా అమలు చేయడం జరుగుతున్నది.ఈ ఆర్థిక సంవత్సరంలో.. ఇప్పటి వరకు,(జులై 1వ తేదీ) మనం 16.26 మిలియన్ టన్నుల బొగ్గు లక్ష్యానికి గాను.. 16,10 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించాం.మిగిలిన 1.64 లక్షల టన్నుల లక్ష్య సాధనకై ప్రతిరోజు శ్రమించాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సర(2025-26) ఉత్పత్తి లక్ష్యమైన 72 మిలియన్ టన్నులకు గాను,జులై 1వ తేదీ వరకు 22.4 శాతం మాత్రమే ఉత్పత్తి సాధించాం. కనుక జులై 9వ తేదీన తలపెట్టిన సమ్మెకు దూరంగా ఉండి, విధులు నిర్వహించాల్సిందిగా జనరల్ మేనేజర్ జి దేవేందర్ విజ్ఞప్తి చేశారు.

## వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**రాయికోడ్ మండల తహసిల్దార్ ఆశాజ్యోతి.**



**అగ్నిధారన్యూస్ “(సంగారెడ్డి)”** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలో తహసిల్దార్ ఆశాజ్యోతి మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్తు ప్రమాదాలకు ఎక్కువ ఆస్కారం ఉంటుందిని గాలి, వానలకు చెట్లు విరిగిపోవడం,విద్యుత్తు లైన్లు తెగిపోవడం లాంటి సంఘటనలు జరుగుతుంటాయిని తెలిపారు.ఈ నేపథ్యం లో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా విద్యుదాఘాతం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రైతులు ఇప్పటికే జోరుగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు అన్నారు. వ్యవసాయ బావుల మోటార్లు,స్టార్టర్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచించారు.తడిసిన కరెంట్ స్తంభాలను,విద్యుత్తులైన్లకు తగిలే చెట్లను ముట్టుకోకూడదు ఒకవేళ కరెంట్ లైన్లపై చెట్ల కొమ్మలు పడి ఉంటే స్థానిక విద్యుత్తు అధికారికి సమాచారం అందించాలి.గాలి దుమారం,వర్షం వచ్చినప్పుడు తెగిపోయిన విద్యుత్తు తీగలను తాకరాదు.వీలైతే స్థానిక విద్యుత్తు అధికారికి సమాచారం అందించాలి.ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు టీవీ,వాటర్ మోటర్స్,రిఫ్రిజిరేటర్, కంప్యూటర్ల స్విచ్లను ఆఫ్ చేయాలి.లేకపోతే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంది.కరెంట్ లైను కింద మొబైల్ ఫోన్లలో మాట్లాడరాదు ఇంటికి ఉన్న విద్యుత్తు సర్వీస్ వైరు ఒకవేళ పాడైపోతే,వెంటనే సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్లి మార్పించుకోవాలి ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువుకు ఎర్త్ తప్పనిసరిగా ఉండాలిని అన్నారు.

# పట్టణంలో ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు

**ఆధునిక సాంకేతిక పట్ల విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలి.**
**- డిజిటల్ పాఠశాలగా మంథని జడ్పిహెచ్ఎస్ ను తీర్చిదిద్దాలి.**
**- ఏఐ టూల్స్, స్పోకెన్ ఇంగ్లీష్ పై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించాలి.**
**- రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు.**




**అగ్నిధార న్యూస్ మంథని :** ఆధునిక సాంకేతికత పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరారు.శనివారం మంథని పట్టణంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు , ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మంథని జూనియర్ కళాశాల మైదానంలో 35 లక్షల నిధులతో చేపట్టిన సింథటిక్ టెన్నిస్ కోర్టు, 10 లక్షలతో చేపట్టిన చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులకు, 4 కోట్ల 5 లక్షల 50 వేల రూపాయలతో చేపట్టిన రావుల చెరువు బ్యూటిఫికేషన్ పనులకు , 2 కోట్ల 99 లక్షల రూపాయలతో చేపట్టిన అయ్యగారి చెరువు బ్యూటిఫికేషన్ పనులకు , గంగపురి వద్ద 2 కోట్ల 55 లక్షల రూపాయలతో చేపట్టిన 33/11 కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు.మంథని పట్టణంలోని బోయిన్ పేట వద్ద 12 లక్షల రూపాయలతో నిర్మించిన చిల్డ్రన్ పార్క్, పోచమ్మ వాడ పాల కేంద్రం వద్ద ఉష ఇంటర్నేషనల్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మహిళ కుట్టు శిక్షణ కేంద్రాన్ని , సీతారామ సేవా సదన్ సౌజన్యంతో మంత్రపురి పరిసర గ్రామ ప్రజలకు బ్రహ్మ తీర్థం ముక్తి దామం (గ్యాస్ ఆధారిత జ్వ లన యంత్రం) , జిల్లా ప్రజా పరిషత్ బాలికల పాఠశాలలో సీడ్స్ ఎన్.జి.ఓ ద్వారా 58 లక్షలతో నిర్మించిన అధునాతన డిజిటల్ క్లాస్ లు, లైబ్రరీని మంత్రి ప్రారంభించారు.

**ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...**

విద్యా , వైద్యం రంగాల పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని అన్నారు. పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని నమ్మకం కలిగిస్తూ బడి బాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. మంథని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో 25 మంది కొత్త విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుంచి వచ్చి చేరడం చాలా సంతోషకరమని అన్నారు.గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేసిందని అన్నారు. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులకు తన వంతు ప్రయత్నం చేస్తానని మంత్రి తెలిపారు. మెగా డీఎస్సీ నిర్వహించి నూతనంగా 10 వేల పైగా ఉపాధ్యాయ పోస్టులను మనం భర్తి చేశామని అన్నారు. 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలను మొదటి ఏడాదిలోనే భర్తీ చేశామని అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ఎక్కడ ఎటువంటి ఆరోపణలు రాకుండా పారదర్శకంగా పూర్తి చేసామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నూతన సాంకేతికతను నెర్పించాలనే లక్ష్యంతో మంథని బాలికల పాఠశాలలో 58 లక్షలతో డిజిటల్ క్లాస్ రూమ్ లను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగ్గా కంప్యూటర్ ల్యాబ్ , లైబ్రరీ మన విద్యార్థులకు అందుబాటులో ఉందని అన్నారు. భవిష్యత్తులో వచ్చే సాంకేతికతను అలవాటు చేసుకుంటూ పోటీ ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాలని అన్నారు.మంథని నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయిలో డిజిటల్ క్లాస్ లను ఏర్పాటు చేయాలని, దీని కోసం సిఎస్ఆర్ నిధులు వినియోగిస్తామని అన్నారు. రోబోటిక్స్, డ్రైవర్ లెస్ కార్లు వంటి సాంకేతిక అంశాలు పిల్లలకు నేర్పాలని అన్నారు. మంథని లో ఉన్న ప్రోటో టైపింగ్ ఇన్నోవేషన్ సెంటర్ ను విద్యార్థులు వాడుకోవాలని మంత్రి సూచించారు. ఏఐ టూల్స్ (కృత్రిమ మేధస్సు) పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందని అన్నారు. టీచర్స్ కు కూడా ఏ.ఐ బోధన పై శిక్షణ అందిస్తామని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లీష్ స్పీకింగ్ స్కిల్ రావాల్సిన అవసరం ఉందని, దీని కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.మంథని పాఠశాలలో టీచర్లకు డిజిటల్ స్టాఫ్ రూమ్ ఏర్పాటు చేస్తామని అన్నారు. మంథని పట్టణంలో చిన్న సాఫ్ట్ వేర్ కంపెనీ ఏర్పాటు చేశామని, 30 మంది యువతకు ఉపాధి లభిస్తుందని అన్నారు. స్థానిక యువతకు విద్యార్థులకు నైపుణ్యాలు పెంచితే పరిశ్రమలు కూడా ఇక్కడ అధికంగా వస్తాయని అన్నారు. పాఠశాలలో ఉన్న మిగిలిన క్లాస్ రూమ్ లను కూడా డిజిటల్ చేయాలని, డిజిటల్ పాఠశాలగా మంథని జడ్పిహెచ్ఎస్ ను తీర్చిదిద్దాలని మంత్రి ఆదేశించారు. పిల్లలు ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ సమాజంలో గొప్ప స్థాయికి ఎదగాలని, పెరుగుతున్న సాంకేతికతను ఉపయోగించాలని, దేశానికి మంచి పౌరులుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్, ఆర్.డి.ఓ. సురేష్, తహసిల్దార్, ఎంపిడిఓ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఖని లో నూతన పార్క్ నిర్మాణానికి సింగరేణి డైరెక్టర్ శంకుస్థాపన



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** సింగరేణి యాజమాన్యం ఆర్జీవన్ లో నూతన పార్కు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.సింగరేణి సివిల్ డిపార్ట్మెంట్ ఆఫీస్ వద్ద దుర్గ మాత అమ్మ వారి ఆలయ కమిటి వారి అభ్యర్ధన మేరకు సన్న హాలు చేసింది.శనివారం సింగరేణి సంస్థ డైరెక్టర్ (ఇ అండ్ యం) డి.సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై నూతన పార్క్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన స్థలంలో మొక్కలు నాటి పార్కు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ పార్కును సుమారు రూ.5 లక్షల అంచన వ్యయంతో నెల వ్యవధిలో అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.వివిధ రకాల ఫల,పుష్పాది మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం విరజిల్లెలా సుందరంగా తీర్చి దిద్దుతామన్నారు.అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు రాజీవ్ రహదారి పక్కన ఉండటం వల్ల రోడ్డు నుండి వెళ్ళు వాహన దారులు,పాదచారులకు సేద తీరవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ యస్.ఓ.టు జిఎం అంజనేయ ప్రసాద్,డిజియం పారేస్ట్ కర్ణ,అనటికల్ ల్యాబ్ సైంటిఫీక్ ఆఫీసర్ హరిసింగ్ అధికారులు వసంత్ కుమార్,వీరారెడ్డి,టెంపుల్ కమిటి సభ్యులు కొయ్యడ మల్లేష్,నరసింహారెడ్డి, రమేష్,అనిత,ఈశ్వర్ రెడ్డి,సత్యనారాయణ పాల్గొన్నారు.

## జులై 9 సమ్మెను జయప్రదం చేయాలి

**సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు**



**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** దేశవ్యాప్తంగా జులై 9న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.శనివారం ఆర్జీవన్ జీడికే 11ఎ గనిలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు.ఈ సమావేశానికి హెచ్ఎంఎస్ ఐఎఫ్టియు టి ఎస్ యు ఎస్,ఏఐఎఫ్టీయూ,టి ఎన్ టి యు సి,ఎస్ జి కే ఎస్ సంఘాల నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఐఎఫ్ టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ.నరేష్,ఏ ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాతంగి రాయమల్లు,టీ ఎస్ యు ఎస్ నాయకులు పోగుల శేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలం గా కార్మిక వర్గానికి నష్టదాయకంగా 4లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని,కేంద్ర ప్రభుత్వం 4లేబర్ కోడ్స్ ను రద్దు చేసే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు.జులై 9న జరుగు అఖిలభారత సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు జీ.రాములు,ఐ.రాజేశం,ఎస్. ప్రసాద్, చింతల శేఖర్,ఎం.రామస్వామి పాల్గొన్నారు.

## గాయపడిన జర్నలిస్టులకు పరిహారం ఇవ్వాలి

**తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల రాజశేఖర్.**



**అగ్నిధారన్యూస్ హైదరాబాద్** రాష్ట్రంలో విధి నిర్వహణలో భాగంగా రోడ్డు ప్రమాదాలలో గాయపడిన, అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఆర్థికంగా నష్టపోయిన జర్నలిస్టులకు తెలంగాణ మీడియా అకాడమీ తరుపున ఇవ్వాల్సిన నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల రాజశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్ వెంకటేశ్వరరావు ను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఏడాదికాలంగా అనేక మంది జర్నలిస్టులు రోడ్డు ప్రమాదాలు జరిగి, అదేవిధంగా అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలలో చికిత్స పొంది డబ్బులు ఖర్చు చేసుకొని ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని అన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మీడియా అకాడమీ తరపున నిధులు మంజూరు చేస్తుందని, కానీ మీడియా అకాడమీ కమిటీ సమావేశాలు లబ్ధిదారులను గుర్తించే విషయంలో జాప్యం చేస్తుందని అన్నారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అదే విధంగా అనారోగ్య బారినపడిన అనేకమంది జర్నలిస్టులు నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో కమిటీ సమావేశాలు నిర్వహించి పరిహారం కోసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులను గుర్తించి నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావును కోరారు.కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు దుర్గం నగేష్ పెద్దపల్లి జిల్లా నాయకులు బందెల శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి




## రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):** చిరువ్యాపారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు.శనివారం గోదావరిఖని వార సంతలో వ్యాపారులకు అవగాహన కల్పించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ పి ఎం స్వనిధి పథకం వీధి వ్యాపారుల కు వరమన్నారు. సకాలంలో వాయిదాలు చెల్లిస్తూ రుణం తీర్చినట్లయతే తరువాతి రుణం అంతకంటే పెద్ద మొత్తంలో మంజూరవుతుందన్నారు.మైక్రో ఫై వడ్డీల బారిన పడకుండా ఉండడానికి వీధి వ్యాపారులకు ఎలాంటి హామీ లేకుండానే పి ఎం స్వనిధి రుణం మంజూరవుతుందని అన్నారు.ప్లాస్టిక్ వాడకం నిషేధం,పరిసరాల పరిశుభ్రత,కుక్కకాటు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం తదితర అంశాలపై కూడా వారికి అవగాహన కల్పించారు. అంతకముందు 8ఇంక్లైన్ కాలనీలో చేపట్టిన పిచ్చి చెట్లు, తుప్పలు,పొదల తొలగింపు పనులను కూడా ఆయన పర్యవేక్షించారు.ఎఫ్ సి ఐ క్రాస్ రోడ్డు లోని వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ పై అవగాహన కల్పించారు. అన్నపూర్ణ కాలనీ ప్రభుత్వ పాఠశాల గోడ లపై చిత్రీకరిస్తున్న సందేశాత్మక చిత్రాలను పరిశీలించారు. హొటళ్లు,రెస్టారెంట్ లలో పరిశుభ్రత తీరును పరిశీలించారు. నిల్వచేసిన అనారోగ్య కర పదార్థాలను గుర్తించి జరిమానా విధించారు. ఈ కార్యక్ర మాలలో నగర పాలక సంస్థ శానిటరి ఇన్స్పెక్టర్ కిరణ్, హెల్త్ అసిస్టెంట్ సంపత్,ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్,ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ మెప్మా ఆర్ పిలు స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

## నోబెల్ విద్యార్థికి ట్రిబుల్ ఐటీలో సీటు

**బాసర ట్రిబుల్ ఐటీ లో సీటు సాధించిన నోబెల్ హై స్కూల్ విద్యార్థిని. విద్యార్థినిని అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ మోహనరాజా.**
**తల్లిదండ్రులు సన్మానించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రణీత. హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయ బృందం.**



**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి** నోబెల్ హై స్కూల్ పెద్దకల్వల లో 10 వ తరగతి పూర్తిచేసుకొన్న పల్లెర్ల అంజలి చిన్నకల్వల బాసర ట్రిబుల్ ఐటీ లో సీటు సాధించింది.10వ తరగతిలో ప్రకటించిన ఫలితాలలో పాఠశాల ప్రథమ స్థానం సాధించడంతోపాటు మండలంలో అత్యున్నతమైన మార్కులు 581 సాధించి ఆదర్శంగా నిలిచింది. సాధించిన మార్కుల ఆధారంగా ఇంజనీరింగ్ విభాగంలో సీటు సాధించింది ప్రతిష్టాత్మక కళాశాల ట్రిబుల్ ఐటీ బాసరలో సీటు సాధించడం హర్షించదగ్గ విషయం అని పలువులు ప్రశంసించారు.పిల్లలు సాధించిన విజయానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు గౌరవం దక్కుతుందని. ఈ సందర్భంగా తల్లిదండ్రులను నోబెల్ హై స్కూల్ కరస్పాండెంట్ మోహన్ రాజా ప్రిన్సిపల్ ప్రణీత ఉపాధ్యాయులు రమేష్, వెంకట్, షబానా , సంపత్ లు అభినందించారు. పుష్పగుచ్ఛం ఇచ్చి చాలువతో సన్మానించారు.



## హీరో సుహాస్ 'ఓ భామ అయ్యో రామ' ట్రైలర్ విడుదల

సినిమా సినిమాకు డిఫరెంట్ కథలను ఎంచుకుంటూ దూసుకెళ్తుతున్న కథానాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేట్రిలక్ రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను గమనిస్తే.. ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్, హీరో, హీరోయిన్స్ ఎనర్జీ, ఇలా ఈతరం ప్రేక్షకులతో పాటు అన్ని వర్గాల వారిని అలరించే ఫుల్ ప్యాకేజీగా ఈ చిత్రాన్ని రూపొందించారని అర్థమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ " ట్రైలర్ విడుదలైన కొద్ది సమయంలోనే మంచి స్పందన వస్తోంది. ట్రైలర్ చూసిన వారు ఈచిత్రం షూర్ షాట్ విజయం అంటుంటే ఆనందంగా ఉంది. క్యూట్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రత సన్నివేశం ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేస్తుంది. హీరో సుహాస్, మాళవిక మధ్య వచ్చే లవ్ సీన్స్ కూడా అలరించే విధంగా ఉంటాయి. సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. తప్పకుండా ఈ చిత్రం అందరికి కొత్త అనుభూతినిస్తుంది. జూలై 11న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. పూర్తి ఎంటర్‌టైనింగ్‌గా రాబోతున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మీ హృదయాలను దోచుకుంటుంది. తప్పకుండా నిర్మాతగా ఓ మంచి సినిమాను ఇవ్వబోతున్నాం అనే నమ్మకం ఉంది అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ప్రతి ప్రమోషన్ కంటెంట్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఓ క్వాలిటీ సినిమాను ప్రేక్షకులకు ఇవ్వడానికి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మాత హరీష్ ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా సినిమాను నిర్మించాడు. ప్రొడక్ట్ క్వాలిటీగా రావడానికి ఆయనే కారణం. మణికందన్ ఫోటోగ్రఫీతో ఈ సినిమాను చాలా కలర్‌ఫుల్‌గా మలిచాడు.రథన్ ఈ లవ్‌స్టోరీకి చాలా మంచి సంగీతాన్ని అందించాడు. ఈ సినిమాలో ఉన్న ఆరుపాటలు వేటికవే అనే విధంగా బ్యూటిఫుల్‌గా ఉంటాయి అన్నారు. ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడు. మణికందన్ సినిమాటోగ్రఫీని అందిస్తున్న ఈ చిత్రానికి రథన్ సంగీతాన్నిసమాకూరుస్తున్నాడు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు

## మళ్లీ వాయిదా పడిన అనుష్క 'ఘాటీ'.. ప్రకటించిన మేకర్స్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఘాటీ' మరోసారి వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమా అనేది ఒక జీవనది లాంటిది. కొన్నిసార్లు ఉరకలు వేస్తుంది.. కొన్నిసార్లు లోతు పెంచుకోవడం కోసం ఆగుతుంది. ఘాటీ కేవలం ఒక సినిమా కాదు. అది పర్వతల ప్రతిధ్వనులు, అడవి గాలి, ప్రకృతి నుంచి చెక్కబడిన అద్భుతమైన కథ. ఈ సినిమాలోని ప్రతి ఫ్రేమ్ అద్భుతంగా మారడం కోసం, సినిమాను వాయిదా వేయాలని మేము నిర్ణయించుకున్నాము. సినిమాపై మీకున్న ప్రేమకు, మీ సహనానికి మా కృతజ్ఞతలు. అవుట్‌పుట్ అత్యుత్తమంగా వచ్చిన తర్వాతే సినిమాను విడుదల చేస్తామని అధికారికంగా ప్రకటిస్తున్నాము అంటూ టీమ్ ప్రకటించింది. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. యూవీ క్రియేషన్స్ సమర్పణలో, రాజీవ్ రెడ్డి, సాయిబాబా నిర్మిస్తున్న ఈ చిత్రం నుండి విడుదలైన గ్లింప్స్ ఇప్పటికే ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. తాజా సమాచారం ప్రకారం, సినిమాకు సంబంధించిన సీజీ (కంప్యూటర్ గ్రాఫిక్స్) పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, విడుదల తేదీ లోపు అవి పూర్తయ్యే అవకాశం లేదని తెలుస్తోంది.





## శేఖర్ కమ్ముల ఫిమేల్ ఓరియంటెడ్ మూవీ..

# పవర్‌ఫుల్ పాత్రలో సమంత!

"శేఖర్ కమ్ములతో సినిమా చేయాలని ఉంది. హీరోయిన్లకు ఆయన మంచి పాత్రలు రాస్తారు" అన్నట్లుగా ఓ సందర్భంలో సమంత పేర్కొన్నారు. ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైనట్లు తెలుస్తోంది. ఇటీవల నాగార్జున-ధనుష్‌లతో 'కుబేర' వంటి హిట్ మూవీ ఇచ్చిన శేఖర్ కమ్ముల తదుపరి ఒక ఫిమేల్ ఓరియంటెడ్ సినిమా చేయాలనుకుంటున్నారని సమాచారం. ఈ చిత్రంలో సమంత కథానాయికగా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఒక బలమైన అంశం చుట్టూ తిరిగే ఈ చిత్రంలో కథానాయిక పాత్ర చాలా వపర్‌ఫుల్‌గా ఉంటుందట. ఇదిలా ఉంటే నాని హీరోగా శేఖర్ కమ్ముల ఓ సినిమా చేయనున్నారనే వార్త వచ్చిన విషయం తెలిసిందే. "ఈ సినిమాకి సంబంధించిన చర్చ ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. పూర్తి స్క్రిప్ట్ రెడీ అయ్యాక ఈ సినిమా గురించిన వివరాలను షేర్ చేస్తాను" అని ఆ మధ్య శేఖర్ కమ్ముల స్పష్టం చేశారు. ఈలోపు సమంతతో ఆయన సినిమా చేయనున్నారనే వార్త తెరపైకి వచ్చింది. మరి... శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నెక్స్ రానున్న సినిమా ఏంటి? అది హీరో ఓరియంటెడ్ మూవీనా? లేక హీరోయిన్ ఓరియంటెడా? ఎవరు నటిస్తారు? అనేది తెలియాలంటే కొన్నాళ్లు వేచి చూడక తప్పదు.

## నా పెళ్లి గురించి మీకెందుకు: రెజీనా



ఈ తరం అమ్మాయిలు పెళ్లి కంటే కెరీర్‌పైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారన్నది కాదనలేని విషయం. ఇంతకు ముందు 16, 18 ఏళ్లకే అమ్మాయిలను పెళ్లీడుకొచ్చారనే వారు. ఇప్పుడు అంతా మారిపోయింది. 21 ఏళ్లు దాటిన తరువాతనే పెళ్లిపై ఆసక్తి చూపుతున్నారు. అయితే సినిమా రంగంలో అయితే 35 దాటిపోతోంది. చాలా మంది హీరోయిన్లు మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్‌గానే ఉంటున్నారు. అలాంటి వారిలో నటి రెజీనా ఒకరు. ఈమె బహుభాషా నటి. తమిళం, తెలుగు, కన్నడం భాషల్లో కథానాయకిగా నటించి పాపులర్ అయ్యారు. ముఖ్యంగా తమిళంలో 2005లో విడుదలైన కండనాళ్ మొదల్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చారు. ఆ తరువాత నటించిన అసుర చిత్రం మంచి పేరు తెచ్చిపెట్టినా, శివకార్తికేయన్‌కు జంటగా నటించిన కేడీబిల్లా కిల్లాడి రంగా చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఆ తరువాత తెలుగు, కన్నడం భాషల్లోనూ పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారు. అయితే కొంత కాలంగా సరైన అవకాశాలు రావడం లేదనే చెప్పాలి. దీంతో ప్రత్యేక పాటల్లో నటించడంతోపాటు ప్రతినాయకి పాత్రల్లో నటించడానికి సై అన్నారు. అదే సమయంలో వెబ్ సిరీస్‌లోనూ నటించడం ప్రారంభించారు. ఇలా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటున్న రెజీనా చాలా బోల్డ్ నటి అనే ముద్ర వేసుకున్నారు. అందాలారబోతకు నో చెప్పని ఈ భామ వయసు 34 ఏళ్లు. ఈమె తమిళంలో చివరిగా నటించిన చిత్రం విడాముయర్చి. అందులో నెగిటీవ్ పాత్రలో నటించారు. కాగా ఇటీవల ఒక భేటీలో 34 ఏళ్లు వచ్చాయి. పెళ్లెప్పుడు చేసుకుంటారన్న ప్రశ్నకు ముక్కు సూటిగా బదులిచ్చిన రెజీనా పెళ్లెప్పుడు చేసుకుంటావని తన తల్లే అడగదని, మీరెందుకు అడుగుతున్నారు? మీకెందుకు అంత అక్కర అని చెప్పింది. అంతే కాకుండా తనతో ఎవరైనా సంబంధం పెట్టుకుంటే వారికే కష్టం అనీ, అందుకే ఫ్రెండ్‌షిపే బెటర్ ఈజీగా ఉంటుందని చెప్పారు. దీంతో నెటిజన్లు ఈ అమ్మడిపై రకరకాల ట్రోల్స్ చేస్తున్నారు.అసలు జీవితంలో పెళ్లి చేసుకుంటారా? లేక అవివాహితగానే ఉండిపోతారా? అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

## హరిహర వీరమల్లు మూవీ థియేటర్‌లో అతడు రీరిలీజ్ ట్రైలర్



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు బర్త్ డే వస్తుందంటే ఎలాంటి హంగామా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వారం ముందు నుండే అభిమానులు ఏర్పాట్లలో ఉంటారు. ఈ సారి మహేష్ బాబు బర్త్ డే సందర్భంగా మహేష్ బాబు నటించిన అతడు చిత్రం విడుదల చేయబోతున్నారు. ఆగస్టు 9 సూపర్ స్టార్ బర్త్ డే కావడంతో అభిమానులకు ఈ సినిమాతో మంచి వినోదం పంచేందుకు సిద్ధమయ్యారు. అయితే చిత్ర 4%ఖ% ట్రైలర్‌ని హరిహర వీరమల్లు మూవీ ఇంటర్వెల్ సమయంలో విడుదల చేయనున్నట్టు తెలుస్తుంది. దీంతో ఇద్దరు హీరోల అభిమానులకి పసందైన వినోదం అందనుంది. కాగా, హరిహర వీరమల్లు చిత్రం జూలై 24న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్న విషయం విదితమే. మరోవైపు మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా ప్రముఖ దర్శకుడు రాజమౌళి తమ సినిమాకు సంబంధించిన గ్లింప్స్ కూడా విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. ఈ గ్లింప్స్ విడుదలైతే, అభిమానుల ఆనందానికి హద్దులు ఉండవు. తొలిసారి మహేష్ బాబు పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేస్తుండగా, ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే మూవీకి సంబంధించి రెండు షెడ్యూల్స్ పూర్తి చేశారు. త్వరలో చిత్ర బృందం కెన్యా షెడ్యూల్ ప్లాన్ చేసింది. ఈ షెడ్యూల్‌లో ప్రియాంక చోప్రా, మహేష్ బాబుతో పాటు ఇతర కీలక నటులపై సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. అయితే మహేష్ బాబు పుట్టిన రోజు సెలెబ్రేషన్లు ఈ సారి ప్రత్యేకమైన రీతిలో జరుగనున్నాయి, దానికి తోడు మైత్రీ మూవీ మేకర్స్, ఇతర సినీ ప్రొడక్షన్ హౌజెస్ కూడా తమ కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన అప్‌డేట్స్ ఇవ్వనున్నాయి. దాంతో ఫ్యాన్స్ అంతా మహేష్ బాబు అభిమానులు ఆగస్ట్ 9 ఎప్పుడు వస్తుందా అని ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులని పలకరించారు. ఈ చిత్రం ఓ మోస్తరు విజయం సాధించింది. ఇప్పుడు ఫ్యాన్స్ అంతా కూడా రాజమౌళి ప్రాజెక్ట్‌పైనే హోప్స్ పెట్టుకున్నారు. ఈ చిత్రంతో మహేష్ ఇమేజ్ హాలీవుడ్ స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
RNI TITLE CODE:TELTEL/2024/89359 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com